వార్త

ఆదివారం

25 ఆగస్టు, 2024










# ఆటలో 'క్రాక్'.. పతకాలకు బ్రేక్



# డాక్టర్ పాత్రలో ప్రియాంక మోహన్!

కోలీవుడ్ హీరోయిన్ ప్రియాంక మోహన్‌కి స్టార్ హీరో పవన్ కళ్యాణ్ ఓజీలో ఆఫర్ రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. సుజిత్ దర్శకత్వంలో ఇప్పటికే ఎనభై శాతం పూర్తయిన 'ఓజీ' మిగతా షూటింగ్ అక్టోబర్ నుంచి మొదలు కానున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. పవన్ కళ్యాణ్ ఓజీ లుక్ పట్ల పవన్ ఫ్యాన్స్ చాలా సంతోషంగా ఉన్నారు. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ డాక్టర్ పాత్రలో కనిపించనుంది. పవన్ కళ్యాణ్-ప్రియాంక మోహన్ మధ్యన బ్యూటిఫుల్ సన్నివేశాలను దర్శకుడు సుజిత్ క్రియేట్ చేసినట్లుగా సమాచారం. అంటే ఓజీలో యాక్షన్‌తో పాటు బ్యూటిఫుల్ రొమాంటిక్ సీన్స్ కూడా ఉండబోతున్నాయన్నమాట!



తారాతీరం



# బాలీవుడ్‌లో శ్రీలీల?

అతి తక్కువ కాలంలో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది శ్రీలీల. తన కెరీర్ ప్రారంభ రోజుల్లోనే మహేశ్‌బాబు, పవన్‌కళ్యాణ్‌లతో స్క్రీన్ స్పేస్‌ను పంచుకునే అరుదైన అవకాశం పొందింది. ఇది ఒక యువ కథానాయికకు గొప్ప విజయం. బాలీవుడ్‌లో కూడా శ్రీలీల అగ్రస్థానంపై కన్నేసినట్లు తెలుస్తోంది. సిద్దార్థ్ మల్హోత్రా తన రాబోయే ప్రాజెక్ట్ 'మిట్టి'లో ఆమె నటించనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామా కలగలిసిన ఈ చిత్రానికి బల్వీందర్ సింగ్ దర్శకుడు. ఈ సినిమా స్క్రిప్ట్ విన్న వెంటనే శ్రీలీల గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. అక్టోబర్‌లో సెట్స్‌పైకి రానుందీ సినిమా. 'మిట్టి'తో పాటు ఇబ్రహీం అలీఖాన్ చిత్రం 'దిలేర్' శ్రీలీల కథానాయికగా నటిస్తోంది.

### 'సరిపోదా శనివారం' ఆగస్టు 29న విడుదల

నాని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ 'సరిపోదా శనివారం' ఆగస్టు 29వ తేదీన విడుదల కానుంది. 'అంటే సుందరానికి' ఫేమ్ దర్శకుడు వివేక్ ఆత్రేయ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంతో తను మాస్ యాక్షన్ చిత్రాలను సైతం తెరకెక్కించగలనని ట్రైలర్ ద్వారా నిరూపించాడు. ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య కీలక పాత్రలో కనిపించనున్నాడు. జెక్స్ బెజోయ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఆదివారం వార్త

25 ఆగస్టు, 2024

## మంచి ముత్యాలు

ప్రశంస పన్నీరులాంటిది, దాన్ని వాసన చూసి వదిలేయాలే కాని, తాగుతూ కూర్చోకూడదు.

- జాన్ బిల్లింగ్స్

## విషయ విశేషం

'ఐటిఐ'లకు పునర్వైభవం రానుందా?.. 4

'సంఘీ'భావం....5

కల్తీని అరికట్టడంలో ప్రభుత్వాల వైఫల్యం

కవర్ స్టోరీ..6

ఆటలో 'క్రాక్'..
పతకాలకు బ్రేక్

ఆరోగ్య పండ్లు....10

ఈవారం కవిత్వం..12

ఉనికి

దుబాయ్ చూసొద్దామా!...14

అనకాపల్లి బెల్లం.....18

కథ.. 20

మా నేల..మా ఊరు

సాహిత్యం..23

తెలుగు భాష పరిణామ వికాసం

నేను చేసింది తప్పే!..25

మంచి సంబంధం కుదరాలంటే... 29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### సర్టిఫికెట్ కావాలా! మొక్కలు నాటండి



కష్టపడి చదువుకుని పాసైన వారికి ఏ కాలేజీ అయినా డిగ్రీ ప్రదానం చేస్తుంది. బిహార్ రాజధాని పాట్నాలో ఉన్న బీఎన్ కాలేజీ విద్యార్థులు పాసైతే సరిపోదు, దానికి తోడు ఓ పది మొక్కలు కూడా నాటితేనే సర్టిఫికెట్‌ను అందజేస్తుందా కాలేజీ యాజమాన్యం. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్న వృక్షశాస్త్ర ప్రొఫెసర్ ధీరజ్ గౌతమ్ ఆలోచన మేరకు ఆ కాలేజీ మేనేజ్‌మెంట్ మొక్కలు నాటించే నిర్ణయం తీసుకుంది. చదువు పూర్తి చేసుకుని వెళ్లిపోయే విద్యార్థులు నాటిన మొక్కల్ని నాటి ఓ చిన్నపాటి వనంలా మార్చేశారు. మొక్కలకీ, సర్టిఫికెట్‌కీ ముడిపెట్టి భలే నిర్ణయం తీసుకున్నాడు కదూ!

### బొమ్మ కోసం బడికి



కేరళలోని ఉదయతుంవతిల్ గ్రామంలోని ప్రైమరీ స్కూల్లో ఓ పాప ఉంది. తను ఒక రోజు పిల్లలతో కలిసి క్లాస్‌లో కూర్చుంటుంది. మరో రోజు కారిడార్‌లోనే నిల్చుంటుంది. కొన్నిసార్లు స్కూలు గేటు వద్దే ఉంటుంది. ఆ పాపతో మాట్లాడటానికి అక్కడి పిల్లలంతా ఎంతో ఆరాటపడుతుంటారు. అసలు ఒకప్పుడు పట్టుమని పదిమంది కూడా లేని బడిలో ఇప్పుడు ఆ చిన్నారివల్లే వందమంది దాకా విద్యార్థులు చేరారు. ఇంతకీ ఆ పాప ఎవరు, ఎంటీ ప్రత్యేకత అంటారా..నిజానికి తను పాప కాదు, బొమ్మ. ఆ స్కూల్లో ఇంగ్లిష్ టీచర్ లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు స్కూలు మానేసిన పిల్లల సంఖ్యా పెరుగుతోంది. అది గమనించిన గ్రామ పంచాయితీ సభ్యులు ఓ ఆలోచన చేశారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సాయంతో వర్చువల్ వాయిస్ అసిస్టెంట్‌ని యూనిఫామ్ వేసుకుని బ్యాగు తగిలించుకున్న బొమ్మ రూపంలో తయారు చేయించి స్కూల్లో ఉంచారు. ఇంగ్లిష్‌లో ఏం అడిగినా సమాధానం చెప్పి, సందేహాలు తీర్చే ఆ బొమ్మతో మాట్లాడటానికి పిల్లలు పోటీ పడుతున్నారు. ఇతర టీచర్లసాయంతో పట్టుదలగా ఇంగ్లిష్ నేర్చుకుంటున్నారు. స్కూలుకీ క్రమం తప్పకుండా హాజరవుతున్నారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# 'ఐటిఐ'లకు పునర్వైభవం రానుందా!

యువభారతాన్ని నైపుణ్య భారతంగా మార్చడానికి అవసరమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందని, యువతలో కార్పొరేట్/పరిశ్రమల అవసర నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రస్తుత ఇండస్ట్రీయన్ ట్రైనింగ్ సెంటర్స్ (ఐటిఐ)ను ఆధునీకరిస్తామని ప్రస్తావించడం హర్షదాయకం. స్వాతంత్ర్యానంతరం ఉద్యోగ ఉపాధుల కల్పన ఉద్దేశంతో 'పునరావాస మంత్రిత్వశాఖ' ద్వారా ప్రారంభమైన వృత్తివిద్యా కోర్సులు/సంస్థలు (ఒకేషనల్/ట్రైనింగ్ సెంటర్లు) కాలక్రమంలో ఐటిఐ పేరుతో లక్షలమంది యువత శిక్షణ పొందడం, సత్వరమే ఉద్యోగాల్లో స్థిరపడి దేశాభివృద్ధికి దోహదపడడం అనాదిగా జరుగుతున్నది. నైపుణ్య యువభారతం నడుంబిగిస్తేనే శతవత్సర స్వాతంత్ర్యవేడుకలు-2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలు నెరవేరుతాయని నమ్ముతున్నాం.

## దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఐటిఐలు

ఐటిఐ సాంకేతిక సంస్థల ద్వారా సీనియర్ సెకండరీ స్థాయిలో యువతకు ఇంజినీరింగ్, ఇంజినీరింగేతర వృత్తి నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగసాధన, దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా అమూల్యసేవలను అందిస్తున్నారు. ఢిల్లీ, నిజాముద్దీన్ ప్రాంత ఐటిఐ సంస్థను అతిపురాతనమైనదిగా పేర్కొంటున్నారు. 2021-22 వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 14,993 ప్రభుత్వ ఐటిఐల ద్వారా 2.5 మిలియన్ల యువతకు శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నారు. 2014లో 9.46.000మంది ఐటిఐ కోర్సుల్లో ప్రవేశాలు పొందగా, 2022 నాటికి 12,40,000 సీట్లు భర్తీ అయ్యాయి. నేటి ఐటిఐ సంస్థలు సమస్యల ఊబిలో చిక్కుకుంటున్నాయి. అర్హత కలిగిన శిక్షకుల కొరత, పాతతరం ప్రయోగశాలలు, వనరుల కొరత, ప్రవేశాల్లో అశ్రద్ధ, ఆధునిక కోర్సులు లేకపోవడం, ఐటిఐల పట్ల సరైన అవగాహన కల్పించకపోవడం లాంటి పలు సమస్యలు నేటి ఐటిఐలను పట్టిపీడిస్తున్నాయి. ప్రైవేట్‌రంగ ఐటిఐలకు తోడుగా తెలంగాణ ప్రభుత్వ సారథ్యంలో 26 ఇంజినీరింగ్, 12నాన్ ఇంజినీరింగ్ ఐటిఐలు శిక్షణ ఇస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రైవేట్ ఐటిఐలు ఉండగా 23 ప్రభుత్వ ఐటిఐలు యువతకు శిక్షణలు అందిస్తున్నాయి.

## ఐటిఐ శిక్షణ పొందిన యువతకు అధిక డిమాండ్

దేశ ఐటిఐల్లో పేరెన్నికగన్న ఢిల్లీ పూస ఐటిఐ నుండి 2022లో 659 మంది శిక్షణ పొందగా అందులోంచి 409 మంది ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు పొందగా, 101మంది ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందగా, 149 మందికి ఇంకా ఉద్యోగాలు దొరకలేదనే తెలుస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకొని టాటా టెక్నాలజీస్ సహకారంతో 65 ఎంపిక చేసిన ప్రభుత్వ ఐటిఐలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా మార్చడం జరుగుతున్నది. ఢిల్లీకి చెందిన ఐటిఐ డిప్లొమా పూర్తి చేసిన 72.3శాతం యువత ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు.

**డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**

కొన్ని ఐటిఐల విద్యార్థులు 97శాతం వరకు ప్లేస్‌మెంట్లు పొందడం జరిగింది. 2023లో తమిళనాడు ఐటిఐ యువత 80శాతం ఉద్యోగాలకు ఎంపికైనా, గత ఏడాది మహారాష్ట్రకి చెందిన ఐటిఐ శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు భారత్‌లోనే కాకుండా జపాన్, సౌదీ అరేబీయా, ఇజ్రాయెల్ లాంటి దేశాల్లో ఉద్యోగాలు పొందడం గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'ఇంటర్నేషనల్ ప్లేస్‌మెంట్ సెంటర్స్' కూడా ఏర్పాటు చేయడం ఆహ్వానించదని పరిణామం. కేరళకు చెందిన ఐటిఐ శిక్షణ పొందిన 4,000 మంది యువతకు జర్మనీలో ఉద్యోగాలు లభించడం శుభవార్తగా తీసుకోవాలి. నేటి డిజిటల్ యుగంలో పరిశ్రమ వర్గాలు కోరుకుంటున్న కొత్తహంగులు కూర్చిన ఐటిఐలను ఏర్పాటు చేయడంతో పాటు ఆదరణలేని పాత కోర్సులను పాతరేసి,నేటి అవసర ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డాటా అనలటిక్స్ లాంటి కోర్సులకు పట్టం కట్టాలి. నేడు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చేయి చేయి కలిపి ఐటిఐ సంస్థలను అత్యాధునిక నైపుణ్య కేంద్రాలుగా మార్చాలని కోరుకుందాం. యువ భారతమాతకు నైపుణ్య యువ మాలలను అలంకరింపజేద్దాం.

# 'సంఘీ' భావం



# కల్తీని అరికట్టడంలో ప్రభుత్వాల వైఫల్యం

శరీరానికి శక్తి కోసం, ఆరోగ్యం కాపాడుకోవడానికి తీసుకుంటున్న ఆహారం కల్తీల కారణంగా విషతుల్యంగా మారుతోంది. పండ్లు, కూరగాయలు, చివరకు పాలు, పప్పులు అన్నీ కల్తీకి గురౌతున్నాయి. వీటిని సేవించడం వల్ల శక్తి రావడం పక్కన పెడితే అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు అప్పుడప్పుడు తనిఖీలు చేసినప్పుడు పలు హోటళ్లలో కుళ్లిన, కల్తీ చేసిన ఆహార పదార్థాలను గుర్తిస్తున్నారు. రసాయనాలు ఉపయోగించడం లేదని చెప్పుకునే పలు స్వీట్ దుకాణాల్లో ఎన్నో లోపాలను అధికారులు గుర్తించారు. ఈ దాడులు, కేసులు నామమాత్రంగా ఉంటున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కల్తీ పదార్థాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మామిడి, అరటి పండ్ల నుంచి బాదం, పిస్తా వంటి ఖరీదైన పదార్థాల వరకు కల్తీమయంగా మారింది. బర్రెలకు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్‌ను ఇస్తున్నారు. దీనివల్ల ఆ పశువుల నుంచి సేకరించే పాలులో ఇంజక్షన్ మూలాలు మిగిలి ఉంటాయి. దీనిని సేవించడం వల్ల చిన్నపిల్లల్లో హార్మోను సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. మహిళల్లో బహిష్టు, గర్భం వంటి సమయాల్లో సమతుల్యత దెబ్బతిని ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. యువతులు ఈ పాలను తాగడం వల్ల మహిళల్లో సహజసిద్ధంగా ఉండే హార్మోన్లు దెబ్బతింటాయి. బాలింతలు ఈ పాలు తాగితే ఆ ప్రభావం తమ వద్ద పాలు తాగే చిన్నారిపై చూపిస్తుంది. దీనితో పసికందులు అనేక రోగాల బారిన పడతారు. ఇది సరిపోదంటూ పాలలో పిండి పొడి, సబ్బు నురగ, ఇతర రసాయనాలు కలుపుతారు. దీనివల్ల జీర్ణకోశ సంబంధిత వ్యాధులు చుట్టుముడతాయి. పప్పులలో రంగులు, రసాయానాలు, లీడ్‌క్రోమెట్ వంటివి ఉపయోగిస్తున్నారు. దీనివల్ల పేగులు దెబ్బతింటాయి. కాఫీ పొడిలో చికోరీ, చింతపండు గింజల పౌడర్ కలుపుతు న్నారు. చక్కెరలో చాక్ పౌడర్, వాషింగ్ షోడా, యూరియా వంటివి కలుపుతున్నారు. మిరియాలు, ఆవాలులో ఎండిన బొప్పాయి గింజలు, బ్లాక్బ గ్రీస్, ఆర్థెమోన్ విత్తనాలతో కల్తీ చేస్తారు. దీనివల్ల కడుపు, చర్మ వ్యాధులు, ఉదర సంకోచాల్లో వ్యత్యాసం, అలెర్జీలు చుట్టుముడతాయి. ఆయుర్వేదంలో యాంటీబయోటిక్‌గా పేర్కొనే పసుపు సైతం కల్తీ చేస్తున్నారు. పురుగుల మందులు, సాడస్ట్, సుద్ద, పరిశ్రమల్లో వాడే రంగులు, మెటానిల్ పసుపు, సీసం వంటివి ఉపయోగిస్తున్నారు. దీనివల్ల కేన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. కారం, ధనియాల పొడిలో ఇటుక పౌడర్, రెడ్‌లెడ్, సింథటిక్ రంగులు, ఆరోగ్యాన్ని హానీ చేసే లవణాలు కలుపుతున్నారు. దీనివల్ల రక్తపోటు, ట్యూమర్, కేన్సర్ వ్యాధులు వస్తున్నాయి. పండ్లు కూరగాయలపై రసాయన రంగులు, మలాకైట్, కాల్షియం కార్బైడ్, కాపర్ సల్ఫేట్, ఆక్సిటోసిన్, సాచరిన్ మైనం వంటి ప్రమాదకర వస్తువులను కలుపుతున్నారు. వీటి వల్ల జీర్ణవ్యవస్థ మందగించడం, క్యాన్సర్ వ్యాధి బారిన పడటం, ఉదర సంబంధ రోగాలు చుట్టుముడతున్నాయి. నెయ్యిలో పశువులకు సంబంధించిన కొవ్వు పదార్థాలు కలుపుతున్నారు. ఇక మామిడి పండ్లు, అరటి పండు మగ్గబెట్టడానికి రసాయనాలు ఉపయోగిస్తున్నారు. యాపిల్ పండ్లు ఎక్కువ కాలం నిల్వ ఉండటానికి మైనం వాడుతున్నారు. కొబ్బరి బోండాలు దిగుబడి రావడానికి, ఎక్కువ నీరు పొందడానికి చెట్ల మొదళ్లకు హానీకర మైన ఇంజక్షన్లు వేస్తున్నారు. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ద్రాక్ష తోటల పెంపకం సమయంలో ఉపయోగించే క్రిమిసంహారక మందులు, ఇతర రసాయనాలు అధికంగా ఉంటు న్నాయి. ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియాను 2006 ఆహార భద్రత ప్రమాణాల చట్టం కింద రూపొందించారు. చట్టం సెక్షన్ 22 ప్రకారం ఆహారాల తయారీ, పంపిణీ, అమ్మకం, దిగుమతుల్లో కల్తీలను నివారించే బాధ్యతను అప్పగించారు. ప్రస్తుతం కల్తీ నేరానికి  వెయ్యి రూపాయల జరిమానా, ఆరు నెలల జైలు శిక్షను విధిస్తున్నారు. అయితే దీనిని పది లక్షల వరకు జరిమానా గాను, యావజ్జీవ శిక్ష గాను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. కల్తీలను మూడు విభాగాలుగా గుర్తించారు. ఆదాయం పెంచుకోవడం కోసం ఉద్దేశ్యపూర్వకంగా కల్తీ చేయడం, అనాలోచితంగా అంటే సాగు సమయంలో ఉపయోగించే రసాయానాల మిళితం వల్ల కలిగే నష్టాన్ని కల్తీగా గుర్తించారు. 1954 నుంచి అమలులో ఉన్న ఏడు రకాల చట్టాలను మిళితం చేసి 2006 నుంచి కొత్త చట్టాన్ని తీసుకువచ్చారు. ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని మార్పు లు తీసుకువచ్చినా క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదు. పలుమార్లు న్యాయస్థానాలు సైతం జోక్యం చేసుకుని ఆగ్రహం వ్యక్తం చేసినా ఫలితం లేకుండా ఉంది. కల్లని అడ్డుకోవడంలో అధికారులు విఫలం అవుతున్నారు. తరచూ సోదాలు నిర్వహించి కేసులు నమోదు చేస్తే కొంత వరకు ఫలితం కనిపిస్తుంది. అయితే సోదాలు నిర్వహించడానికి కావల్సిన మేరకు సిబ్బంది లేకపోవడంతో కల్తీ వ్యాపారాలను అరికట్టేందుకు వీలు లేకుండా ఉంది. దీనితో కల్తీని నిరోధించే అవకాశం ఉండటం లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వీటి గురించి పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీ కరించలేకపోతున్నారు. వ్యాపారం చేయాలంటే కల్తీ తప్పదన్న దృక్పథం వ్యాపారుల్లో కలుగుతోంది. అయితే దీనివల్ల వారికి ఆర్థికపరమైన వెసులుబాటు కలిగినా ప్రజలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. కల్తీ విషయంలో ప్రభుత్వం కఠిన వైఖరి ఉపయో గించినప్పుడే కల్తీని కొంత వరకైనా నివారించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# ఆటలో 'క్రాక్'.. పతకాలకు బ్రేక్

కవర్ స్టోరీ

సిహెచ్.వి.వి.రఘుబాబు

**కొన్ని ఆశలు..కొన్ని నిరాశలు 'ఆట'లో సహజమే. కానీ ఒలింపిక్స్ విశ్వక్రీడల్లో మాత్రం భారత్‌కు తీవ్రనిరాశే మిగిలింది. అమెరికా, చైనా 40 చొప్పున బంగారు పతకాలు సాధించగా భారత్‌కు ఒక్కటైనా లభించకపోవడం నిజంగా విచారకరమే. గత టోక్యో ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణమైనా లభించింది. నాలుగు సంవత్సరాలకో సారి జరిగే ఈ క్రీడల్లో ఈసారి మరిన్ని స్వర్ణాలు, మరిన్ని పతకాలు సాధించాలని భారత్ జట్లు శపథం చేశాయి. అయితే చివరికొచ్చేసరికి అంతా నీరుగారిపోయింది. ఒక్క రజతం, ఐదు కాంస్యాలతో భారత్ 71వ స్థానానికి పడిపోయింది. 32 క్రీడాంశాలుండగా, మన ఆటగాళ్లు 16 అంశాలలోనే పోటీపడ్డారు. 117మంది అథెట్లు మాత్రమే బరిలోకి దిగారు. మనకు వచ్చిన ఆరు పతకాల్లో కూడా నాలుగు హర్యానా పుణ్యమే. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో క్రీడాపురోగతి ఇంతేనా? అనిపిస్తుంది. దానికి బాధ్యులెవరు? ప్రభుత్వమా! ఆటగాళ్లా! ఇద్దరూనా! ఇప్పటికైనా ఆలోచించాలి. ఆటల్లోంచి రాజకీయాలను తొలగించగలిగితే వచ్చే ఒలింపిక్స్‌లోనైనా లక్ష్యాలను చేరగలుగుతాం. భారత్ 'విశ్వగురు' కావాలంటే 'ఆట' అదరాలి కదా!**

అత్యంత ఆసక్తికరంగా సాగిన విశ్వ క్రీడా సంబరం ముగిసింది. పారిస్ వేదికగా 19 రోజుల పాటు జరిగిన ఒలింపిక్స్-2024 వేడుకలు సమాప్తమయ్యాయి. ప్రపంచంలో అత్యున్నత క్రీడలుగా భావించే ఒలింపిక్ క్రీడలు ప్రతీ నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరిగే అంతర్జాతీయ క్రీడా ఉత్సవం. ఒలింపిక్స్ అంతిమ లక్ష్యాలు క్రీడల ద్వారా మానవ మేధస్సు, జాతి విలువలు పెంపొందించడం, ప్రపంచ శాంతికి దోహదం చేయడం. ఈ ఒలింపిక్స్‌లో సమ్మర్ గేమ్స్, వింటర్ గేమ్స్ విడివిడిగా జరుగుతాయి. అక్కడి ప్రజలు మౌంట్ ఒలింపోస్ గ్రీకు దేవతలకు నివాసంగా ఉంది. తమ దేవతలను ఆరాధించడానికి ప్రజలు అక్కడికి వెళ్లారు. అక్కడ పురాతన గ్రీస్ యొక్క అత్యంత ప్రసిద్ధ దేవుడు జ్యూస్ దేవతల రాజు గౌరవార్థం ఒలింపిక్స్ సృష్టించబడ్డాయనేది చరిత్ర చెబుతోంది.

ఈ నేపథ్యంలో మొట్ట మొదటి ఒలింపిక్స్ ద776 బిసి వేసవిలో దక్షిణ గ్రీస్‌లోని ఒలింపియాలో జరిగాయి. డాలు పట్టుకుని, నెత్తిన శిరస్త్రాణం పెట్టుకుని రన్నింగ్ రేస్‌ను నిర్వహించారు. ఇక ఈ మొట్ట మొదటి ఒలింపిక్స్‌లో మౌంట్ ఒలింపోస్ సమీపంలోని లిస్ నగరానికి చెందిన కొరోయిబోస్ అనే వంటవాడు 600 అడుగు పొడవైన ఫుట్ రేస్‌లో (పరుగు పందెం) స్టేడియన్ రేసును గెలుచుకున్నాడు. ఇతనే మొదటి ఒలింపిక్స్ విజేతగా గుర్తింపు పొంది రికార్డుకు ఎక్కాడు.

ఒలిపింక్స్ ముగింపు వేడుకలను సైతం ఘనంగా నిర్వహించారు. గత నెల అధికారికంగా 26వ తేదీన ప్రారంభం కాగా, అంతకు రెండు రోజుల ముందే అనధికారికంగా పారిస్ ఒలింపిక్స్ ప్రారంభమయ్యాయి. సెన్ నది వేదికగా ఈ వేడకలకు బీజం పడగా, స్టేడ్ డి ఫ్రాన్స్ స్టేడియంలో ముగిశాయి. నృత్యకారులు, సంగీత కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను పరవశింప చేశారు. భారత్ తరపున షూటర్ మను బాకర్, హాకీ దిగ్గజం పిఆర్ శ్రీజేష్ పతకదారులుగా వ్యవహరించారు. భారీ ఎత్తున తరలివచ్చిన ప్రేక్షకులకు అభివాదం తెలుపుతూ క్రీడాకారులు వీడ్కోలు పలికారు. దాదాపు 850 పతకాలు విజేతలను వరించిన ఈ 2024 ఒలింపిక్స్‌లో 10 ప్రపంచ రికార్డులు, 32 ఒలింపిక్ రికార్డులతో సహా మొత్తం 42 రికార్డులు బద్దలయ్యాయి. ఈ ఒలింపిక్స్‌లో 32 క్రీడాంశాల్లో 329 స్వర్ణ పతకాలకు 206 దేశాలకు చెందిన 10,714 మంది క్రీడాకారులు పోటీ పడగా, అమెరికా 40 స్వర్ణాలతో

అగ్రస్థానంలో నిలిచింది. చివరి బంగారు పతకాంశం వరకూ టాప్‌లో ఉన్న చైనాను వెనక్కి నెట్టిన అమెరికా పాయింట్ల పట్టికలో తొలి స్థానాన్ని ఆక్రమించింది. ఈ ఒలింపిక్స్ చివరి పోటీలు అయిన మహిళల బాస్కెట్‌బాల్‌లో అమెరికా జట్టు బంగారు పతకాన్ని గెలిచి తమకు తిరుగులేదని నిరూపించింది. అమెరికా జట్టు 40 గోల్డ్ మెడల్స్‌తో సహా మొత్తంగా 126 పతకాలతో ప్రథమ స్థానం, చైనా 40 గోల్డ్ మెడల్స్‌తో పాటు మొత్తం 91 పతకాలతో రెండో స్థానంలోను, జపాన్ 20 గోల్డ్ మెడల్స్‌తో మూడో స్థానంలో నిలిచాయి. గత టోక్యో ఒలింపిక్స్‌లో ఒక స్వర్ణం, రెండు రజతం, నాలుగు కాంస్యంతో మొత్తంగా 7 పతకాలతో ప్రపంచ దేశాల్లో 48వ స్థానాన్ని సాధించగా, ఈ పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం లేకుండా ఒక రజతం, 5 కాంస్యాలతో 71వ స్థానికి దిగజారింది. తదుపరి 2028 ఒలింపిక్స్ పోటీలో లాస్ ఏంజెలెస్ వేదికగా జరగనున్నాయి.



## పతకాల కోసం అమెరికా, చైనా మధ్య సస్పెన్స్ థ్రిల్లర్

ఒలింపిక్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి క్రీడాభిమానులను మురిపించారు. ఓవరాల్‌గా చూసుకుంటే అమెరికా అత్యధిక పతకాలతో అగ్ర స్థానంలో నిలిచింది. చైనా సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించిన పోటీలో చివరకు పై చేయి సాధించింది. ఈ ఒలింపిక్స్‌లో అమెరికా, చైనా చెరో 40 పతకాలు సాధించినప్పటికీ, మొత్తం పతకాల విషయంలో మాత్రం చైనాకు అందనంత ఎత్తులో అమెరికా చేరింది. దీంతో చైనా రెండో స్థానంతో సరిపెట్టుకోక తప్పలేదు.

వాస్తవానికి ఒలింపిక్స్‌లో ఎవరు ఎక్కువ స్వర్ణాలు సాధిస్తే వారే మెడల్ టేబుల్‌లో టాప్ పొజిషన్‌లో ఉన్నట్లు భావిస్తారు. దీంతో చివరి రెండు రోజుల్లో చైనా, అమెరికా మధ్య గట్టి పోటీ నెలకొంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో మాత్రమే అమెరికాపై చైనా పై చేయి సాధించగలిగింది. ఫ్రాన్స్‌లో ఆ ఫీట్ రిపీట్ చేయాలని చైనా క్రీడాకారులు గట్టి పట్టుదలతో పోరాడారు.



టేబుల్ టెన్నిస్‌లో క్వీన్ స్వీప్ చేయడం ద్వారా అమెరికాను చైనా దాటేసింది. అయితే చివరి రెండు రోజుల్లో అమెరికా పుంజుకుంది. బాస్కెట్‌బాల్‌లో పురుషులు, మహిళలు సత్తా చాటి స్వర్ణాలు దక్కించుకున్నారు. ఇక చివరి రోజు ఈ పోటీ సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించింది. బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన చైనా తన స్వర్ణాల సంఖ్యను 40కు పెంచుకుంది. అమెరికా 39 దగ్గరే ఆగిపోయింది. దీంతో మహిళల జట్టు ఫ్రాన్స్‌తో ఆడాల్సిన బాస్కెట్ బాల్ పోటీ మీదే అమెరికా ఆశలు పెట్టుకుంది. హోరాహోరీగా జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ పలుసార్లు పై చేయి సాధించింది. కానీ అమెరికా జట్టు గొప్పగా పోరాడి స్వర్ణాన్ని చేజిక్కించుకుంది. దీంతో అమెరికా కూడా 40 స్వర్ణాలు సాధించింది. దీంతో అమెరికా 40 స్వర్ణాలు, 44 రజతాలు, 42 కాంస్యాలతో మొత్తం 120 పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఇక 40 స్వర్ణాలు, 27 రజతాలు, 24 కాంస్యాలతో మొత్తం 91 పతకాలు సాధించి చైనా రెండో స్థానానికి పరిమితమైంది. డబుల్ డిజిట్ కాదు గతం కంటే తక్కువే..

పారిస్ ఒలింపిక్స్-2024లో భారత్ అథ్లెట్లు తీవ్ర నిరాశకు గురిచేశారు. 52 లక్షల జనాభా మాత్రమే ఉన్న న్యూజిలాండ్ 10 స్వర్ణాలు సాధిస్తే 140 కోట్ల జనాభా ఉన్న భారతావని ఒక్కటంటే ఒక్క బంగారు పతకం సాధించ లేకపోయింది. చివరకు మన దాయాది దేశం పాకిస్థాన్ సైతం బంగారు పతకం గెలుచుకుంది. భారత్ అథెట్లు మాత్రం ఓ రజతం, ఐదు కాంస్యాలతో మొత్తం 6 పతకాలతోనే సరిపెట్టారు. గత టోక్యో ఒలింపిక్స్‌లో 7 పతకాలు రాగా, వాటిలో ఒకటి స్వర్ణం, 2 రజతం, 4 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ సారి వీటి కంటే డబుల్ డిజిట్‌లో పతకాలు వస్తాయని భారీగా ఆశలు పెట్టుకున్నా అవన్నీ అడియాశలే అయ్యాయి. పైగా గతసారి కంటే తగ్గడంతో భారత్ క్రీడాకారుల సామర్థ్యం, నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం భారత్ మెడల్స్ పట్టికలో 71వ స్థానంలో నిలిచింది. పతకాల ఖాతా తెరిచిన 84 దేశాల్లో భారత్ అట్టడుగు స్థాయిలో నిలవడాన్ని క్రీడాభిమానులు సహించలేకపోతున్నారు.

## భారత్ అథ్లెట్లకు రూ.470 కోట్ల ఖర్చు

రియో ఒలింపిక్స్-2016లో రెండు పతకాలు మాత్రమే సాధించిన భారత్, టోక్యో ఒలింపిక్స్‌లో 7 పతకాలతో ఒక మోస్తరు ప్రదర్శన చేసింది. దాంతో క్రీడల్లో భారత్ క్రమేపీ పురోగతి సాధిస్తోందని, భవిష్యత్‌లో ఇక తిరుగే ఉండని అంతా భావించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల వేటలో మన క్రీడాకారులు ముందుంటారని భావించిన కేంద్ర ప్రభుత్వం కూడా అందుకు తగినట్లు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పారిస్ ఒలింపిక్స్ సన్నాహాల కోసం బాగా ఖర్చు చేసింది. ఈ విశ్వక్రీడల్లో భారత్ అథ్లెట్లు సత్తా చాటాలనే లక్ష్యంతో వారికి ఒకింత చేయూతను అందించింది. దీంతో గత మూడేళ్లుగా పారిస్ ఒలింపిక్స్ కోసం భారత ప్రభుత్వం 470 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టింది. ఇందులో ఎక్కువ భాగం అథ్లెటిక్స్ క్రీడాకారుల కోసం 96.08 కోట్ల రూపాయలను ఖర్చు చేయగా, బ్యాడ్మింటన్‌కు 72.02 కోట్ల రూపాయలు, బాక్సింగ్‌కు 60.93 కోట్ల రూపాయలు,



షూటింగ్‌కు 60.42 కోట్ల రూపాయలను వ్యయం చేసింది.

## జస్ట్‌లో 7 పతకాలు మిస్

పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణాలతో పాటు, రెండంకెల మీద పతకాలను సాధిస్తారని మన క్రీడాకారులపై గట్టి నమ్మకం పెట్టుకున్నా 6 పతకాలతోనే ఇంటిదారి పట్టారు. అయితే మరో 7 పతకాలకు అవకాశం వచ్చినా అథ్లెట్లు వాటిని తృటిలో మిస్ అయ్యారు. అటువంటి వారిలో మను బాకర్ ఒకరు. మను అద్భుత ప్రదర్శన చేసి 2 కాంస్య పతకాలు సాధించింది. అయితే మను మరో పతకం సాధించే అవకాశం ఉంది. ఆమె 25 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో తృటిలో పతకం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. ఇక బ్యాడ్మింటన్ స్టార్ షట్లర్ లక్ష్యసేన్ సెమీ ఫైనల్స్‌కు చేరాడు. అయితే ఇందులో ఓటమిని చవిచూశాడు. ఆ తర్వాత కాంస్య పతక మ్యాచ్‌లో ప్రారంభంలోనే ఆధిక్యం సాధించాడు. ఆపై తన లయను కోల్పోయాడు. అలాగే మహేశ్వరి చౌహాన్, అనంత్‌లకు షూటింగ్ పోటీల్లో భారత్ తరపున పతకం సాధించే అవకాశం లభించింది. కాంస్య పతక పోరులో రెండు జోడీలు కేవలం 1 పాయింట్ తేడాతో నాలుగ స్థానానికి పరిమితమై పతక అవకాశాన్ని కోల్పోయింది. మిక్స్‌డ్ ఆర్చరీ టీమ్‌లో బొమ్మదేవర ధీరజ్, అంకిత భకత్ ద్వయం మరో పతకాన్ని తెస్తుందని అంతా భావించారు. ఇక్కడా కూడా ఈ భారత్ జోడీ నాలుగో స్థానం దక్కించుకుంది. ఇక భారత్ షూటర్ అర్జున్ బాబుటాకు కూడా పతకం సాధించే అవకాశం వచ్చింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో కాంస్య పతక మ్యాచ్ ఆడాడు. అయితే ఓటమి చెంది జెస్ట్ పతకం మిస్సయ్యాడు. స్టార్ మహిళా అథ్లెట్ మీరాబాయి చాను నుండి కోట్లాది మంది క్రీడాభిమానులు పతకం ఆశించారు.

టోక్యో ఒలిపిక్స్‌లో రజత పతకం సాధించిన ఈమె ఈసారి బంగారు పతకం తెస్తుందని ఎదురు చూశారు. అయితే కేవలం 1 కేజీ తేడాతో నాలుగో స్థానంతో సరిపెట్టింది. కాగా రెజ్లింగ్ మహిళల 50 కేజీల విభాగంలో వినేష్ ఫోగట్ ఫైనల్‌కు చేరింది. కానీ నిర్లక్ష్యం కారణంగా 100 గ్రాములు బరువు పెరగడంతో అనర్హతకు గురైంది. లేకుంటే బంగారు లేక రజత పతకం అయినా వచ్చి ఉండేది.

## మెడల్స్ లేకున్నా రివార్డులే ఘనం

పారిస్ ఒలింపిక్స్-2024లో భారత్ అథ్లెట్లు ఆశించిన స్థాయిలో మెడల్స్ తీసుకురాకపోయినా, ప్రతిష్టాత్మమైన రివార్డులు మాత్రం తెచ్చిపెట్టారు. మరి కొందరు అథ్లెట్లు తమ రికార్డులు తామే బ్రేక్ చేశారు. స్వాతంత్ర్యానంతరం ఒకే ఎడిషన్‌లో మల్టీపుల్ మెడల్స్ సాధించిన తొలి ఇండియాన్‌గా మను బాకర్ నిలిచారు. 1900లో నార్మన్ ప్రిచర్డ్ కూడా ఈ ఘనత సాధించాడు. ఈ ఒలింపిక్స్‌లో మహిళల 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో కాంస్యం, మిక్స్‌డ్ 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్లో సరబ్ జోత్ సింగ్ జోడీతో కలిసి మరో కాంస్యాన్ని గెలుచుకుని రికార్డు సృష్టించింది. అలాగే ఈ ఒలింపిక్స్ వేదికగా హాకీలో భారత్‌కు కాంస్యం తెచ్చిపెట్టడంలో హర్మన్ ప్రీత్ సింగ్ కీకంగా వ్యవహరించాడు. ఇండియా సాధించిన 15 గోల్స్‌లో 10 గోల్స్ అతను చేసినవే. ఇక భారత్ షూటింగ్‌లో 2012 తర్వాత మరో 12 ఏళ్ల అనంతరం తొలిసారిగా పతకాన్ని సాధించింది. ఇక 2008లో రెజ్లర్ సుశీల్ కుమార్ భారత్‌కు రజతాన్ని సాధించాడు. అప్పటి నుండి ఒలింపిక్స్‌లో వరుసగా ఈ ఈవెంట్‌లో పతకాలు వస్తున్నాయి. అలా ఈ పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లర్ సెహ్రావాత్ పతకాన్ని సాధించి ఆ ఆనవాయితీని కొనసాగించాడు. దీంతో ఒలింపిక్స్ చరిత్రలో రెజ్లింగ్‌లో భారత్‌కు ఇది ఎనిమిదో పతకం. కాగా అర్జున్ బబుటా, మీరాబాయి దాను, లక్ష్యసేన్, అనంత్ జీత్ సింగ్ నారుకా-మహేశ్వరీ చౌహాన్‌ల మిక్స్‌డ్ షూటింట్ టీం, ఆర్చర్లు అంకితా బకత్-బొమ్మదేవర ధీరజ్ పతకానికి ఒక్క అడుగు దూరంలో (3వ స్థానం కాంస్యం) అంటే నాలుగో స్థానంలో నిలిచారు. ఫైనల్ చేరడానికి ముందు బౌట్స్‌లో వరుసగా మూడింటిలోనూ విజయం సాధించిన వినేశ్ ఫోగాట్, ఫైనల్ బౌట్‌కు ముందు 100 గ్రాముల బరువు ఎక్కువగా ఉండటంతో అనర్హత వేటుకు గురై పోటీ నుండి నిష్క్రమించాల్సి వచ్చింది. జపాన్‌కు చెందిన యూ సుపాకీ ఇంటర్నేషనల్ పోటీల్లో ఒక్క సారి కూడా ఓడింది లేదు. ఒలింపిక్స్‌లో వినేశ్ ఫోగాట్‌తో తలపడ్డాక ముందు 82-1గా మారిపోయింది. ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియాపై 52 సంవత్సరాల తర్వాత ఇండియా విజయాన్ని నమోదు చేసింది. 1972 తర్వాత కంగారూలను 3-2 తేడాతో ఓడించి చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. కాగా 21 సంవత్సరాల 24 రోజుల వయస్సు ఉన్న రెజ్లర్ అమన్ సెహ్రావత్ వ్యక్తిగత ఈవెంట్‌లో ఒలిపింక్ పతకం సాధించిన అతి పిన్న వయస్కుడిగా ఘనత సాధించాడు. అంతకంటే ముందు ఈ ఘనతను 21 సంవత్సరాల ఒక నెల 14 రోజుల వయస్సున్నప్పుడు పిపీ సింధు సాధించింది. టోక్యో ఒలింపిక్స్‌లో వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించిన మీరా బాయి దాను మల్టిపుల్ మెడల్‌ను దక్కించుకున్న నీరజ్ చోప్రా, మనుబాకర్, హాకీ టీం జాబితాలో చేరే అవకాశాన్ని 2 కెజీల దూరంలో చేజార్చుకుంది. 114 కేజీలను ఎత్తాల్సి ఉండగా, చివరిగా వేసిన 2 కేజీల బరువును ఎత్త లేకపోవడం కూడా ఒక రికార్డే అయింది.



## ఒలింపిక్స్‌లో ఇప్పటి వరకూ 45 పతకాలు

ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఒలింపిక్స్‌లో కలిపి భారత్ మొత్తం 41 పతకాలు సాధించింది. 1900లో భారత్ మొదటి ఒలింపిక్స్ పతకం సాధించింది. నార్మన్ ప్రిచర్డ్ రెండు రజతాలు గెలుచుకున్నాడు. 1952లో హెల్సింకి ఒలింపిక్స్‌లో కేడీ జాదవ్ రెజ్లింగ్‌లో కాంస్య పతకం గెలిచి, స్వతంత్ర భారతదేశం నుండి వ్యక్తిగతంగా ఒలింపిక్ పతకం గెలిచిన మొదటి అథ్లెట్‌గా నిలిచాడు. 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి ఒలింపిక్ పతకాన్ని గెలుచుకున్న మొదటి భారతీయ మహిళగా నిలిచారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో రైఫిల్ షూటర్ అభినవ్ బింద్రా గోల్డ్ మెడల్ గెలిచి, వ్యక్తిగతంగా ఒలింపిక్ బంగారు పతకం సాధించిన మొదటి భారతీయుడిగా నిలిచాడు. మరో బంగారు పతకం సాధించడానికి ఇండియాకు 12 ఏళ్లు పట్టింది. 2020 టోక్యో ఒలింపిక్సలో నీరజ్ చోప్రా బంగారు పతకం సాధించాడు. ఇప్పటి వరకూ ఒలింపిక్స్‌లో పురుషుల హాకీ జట్టు 8 స్వర్ణంతో సహా మొత్తంగా 13 పతకాలు సాధించింది. ఏడు పతకాలతో రెజ్లింగ్ తర్వాత స్థానంలో ఉంది. 2020 టోక్యో ఒలిపిక్స్‌లో భారత్ అత్యుత్తమంగా ఒక స్వర్ణం సహా 7 పతకాలు గెలిచింది.



## ఎక్కడ లోపం? ఎలా అధిగమించాలి?

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ సాధించింది ఏమిటనే దానిపై ఆశ నిరాశలు దోబూచులాడతాయి. 117 మంది అథ్లెట్లతో, 16 క్రీడాంశాల్లో పోటీ పడుతూ భారత్ ఒలింపిక్ బృందం ఎన్నో ఆశలతో విశ్వ వేదికపై అడుగు పెట్టింది. తీరా ఒలింపిక్స్ ముగిసే వేళకు స్వర్ణం లేకుండా అరడజను పతకాలతో తృప్తిపడాల్సి వచ్చింది. మన పతకాలు, జనాభా నిష్పత్తి చూస్తే ప్రతి 25 కోట్ల మందికి ఒక్క పతకం వచ్చిందన్న మాట. ఖేల్ ఇండియా పేరిట కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామంటున్న పాలకులు ఆత్మ శోధనకు దిగాల్సిన అంశం ఇది. కేవలం రెండే పతకాలు సాధించిన 2016 నాటి రియో ఒలింపిక్స్‌తో పోలిస్తే, భారత్ మెరుగైన మాట వాస్తవమే. అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, మహిళా బ్యాడ్మింటన్‌లో వెనుకబడినా టేబుల్ టెన్నిస్, షూటింగ్‌లలో కాస్త ముందంజ వేశామన్నదీ కాదనలేం. కానీ ఈ ఒలింపిక్స్‌లో ఆరు సందర్భాల్లో మన వాళ్లు ఆఖరి క్షణంలో నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. లేదంటే పతకాల పట్టికలో మన దేశం మరింత ఎగబాకేదే. పతకాలు, విజయాల మాటెలా ఉన్నా, మన మార్కెటింగ్ విపణికి కొన్ని కొత్త ముఖాలు దొరికాయి. గాయాల నుండి ఫినిక్స్ పక్షిలా లేచిన నీరజ్ చోప్రా, పివీ సింధుల మొదలు నిలకడగా ఏళ్ల తరబడి ఆడిన శ్రేజేశ్, రెండు పతకాల విజేత మనూ బాకర్, బ్యాడ్మింటన్ క్రేజ్ లక్ష్యసేన్ దాకా పలువురు బ్రాండ్లకు ప్రీతిపాత్రులయ్యారు. కానీ ఇది సరిపోతుందా? ఆర్చరీ, బాక్సింగ్ సహా పలు అంశాల్లో నిరాశాజనక ప్రదర్శన మాటేమిటి? మిశ్రమ భావోద్వేగాలు రేగుతున్నది అందుకే. ఎప్పటికైనా మన ప్రాధాన్యతలను సరి చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. అత్యధిక జనాభా గల దేశంగా ప్రతిభకు భారత్ కొదువ లేదు. ప్రతిభావంతులను గుర్తించి, వారిని ప్రోత్సహించి, సరైన రీతిలో తీర్చిదిదడమే కరవు. మనకొచ్చిన 6 పతకాల్లో 4 దేశ విస్తీర్ణంలో 1.4 శాతమే ఉండే హర్యానా సంపాదించి పెట్టినవే. అంటే మొత్తం పతకాల్లో హర్యానా ఒక్కదాని వాటా 66 శాతం. మరి మిగిలిన దేశం సంగతి ఏమిటి? అక్కడి పరిస్థితులేమిటి? ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థ మనదని జబ్బలు చరుచుకుంటున్న పాలకులు ఇవాళ్టికీ క్రీడలకు సరైన రీతిలో వసతులు, వనరులు ఇవ్వడం లేదు. పేరొచ్చాక సాయం చేస్తే సరిపోదు. క్షేత్ర స్థాయిలో ఆటగాళ్లకు నారు పోసి, నీరు పెట్టాలి. మన క్రీడా సంఘాలు, ప్రాధికార సంస్థలు రాజకీయ నేతల గుప్పెట్లో ఇరుక్కుపోవడం పెను విషాదం. పతకాలకై పోరాడాల్సిన ఆటగాళ్లు లైంగిక వేధింపులతో సహా అనేక సమస్యలపై రోడ్డెక్కి పోరాటాలు



చేయాల్సిన దుస్థితిని కల్పించడం మన ప్రభుత్వాల మొదటి తప్పు. క్రీడా సంస్కృతిని పెంచి పోషించానికి బదులు రాజకీయాల క్రీనీడలో ఆటను భ్రష్టు పట్టిస్తే, పతకాలు వచ్చేదెట్లా? అంతర్జాతీయ స్థాయిలో విజయానికి దూరదృష్టి, సరైన వ్యూహం, నిరంతరం పెట్టుబడి, స్పష్టమైన క్రీడా విధానం రాష్ట్ర స్థాయి నుంచే కీలకం అవుతాయి. మెరికలు, అద్భుత ప్రతిభ చూపే క్రీడాకారులు ఉన్నా జిల్లాల నుండి రాష్ట్రాలు, కేంద్ర స్థాయి వరకూ క్రీడాకారుల ఎంపిక, శిక్షణలో రికమెండేషన్లు, రాజకీయాంశాలకే ప్రాధాన్యతనిస్తుండటంతో క్రీడల్లో భారత్ వెనుకబడి పోవడానికి ప్రధాన కారణంగా ఉంది. ఆ దిశగా ఆలోచించాలే తప్ప దాహమేసినప్పుడు బావి తవ్వితే ఒపింపిక్స్ ఫలితాలగానే ఉంటుందనేది నగ్న సత్యం. అందుకే 1900 తర్వాత నూటపాతికేళ్లలో ఒలింపిక్స్‌లో ఇది రెండో అత్యుత్తమ ప్రదర్శన. ఇకనైనా అపూర్వ క్రీడా దేశంగా మనం అవతరించాలంటే పాలకులు చేయాల్సింది చాలా ఉందనే వాస్తవాన్ని గ్రహించాల్సి ఉంది. ❑

**టమాటాలు లేకపోతే మన ఆహార పదార్థాలు వెలవెలబోతాయి. చిక్కని ఎరుపురంగుతో ఇట్టే ఆకర్షించే టమాటా గురించి ఒక్కమాటలో చెప్పాలంటే పోషకాల పవర్‌హౌజ్. ముఖ్యంగా**

# ఆరోగ్య పండ్లు



**ఇందులోని లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్‌లో గుండెను రక్షించే గుణాలు ఎన్నో ఉన్నాయి. ఈ ఒక్క పదార్థామే టమాటాను సూపర్‌ఫుడ్‌గా మార్చింది.**

ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ స్థాయుల్ని తగ్గించడానికి లైకోపీన్ సహాయపడుతుంది. ఇంకా యాంటీకేన్సర్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బయాటిక్ గుణాలు కూడా ఉన్నాయి. అందుకే సలాడ్‌లలో పచ్చిగానే కాదు. కూరగా, రసంలా, జ్యూస్‌లా ఏవిధంగా టమాటాలను ఆరగించినా ఆరోగ్యానికి మంచిది. ఇంకా ఫైబర్, విటమిన్ సి, విటమిన్ ఎ, పొటాషియం, కాల్షియం తదితర పోషకాలు టమాటాలలో ఎక్కువగా ఉన్నాయి. ఏ కాలంలోనైనా టమాటాను ఏదో రూపంలో తీసుకోవడం మాత్రం మరవొద్దు.

**పోషకాల దానిమ్మ:** దానిమ్మపండు..నిను చూడగానే నోరూరు చుండు' అని పిల్లలు పాడడం మామూలే. కేవలం



ఆకర్షణలోనే కాదు..దానిమ్మలో పోషకాలు కూడా ఎక్కువే. సూపర్‌ఫుడ్స్ లిస్టులో దానిమ్మ కూడా స్థానం పొందింది. ఈ పండులో విటమిన్లు, మినరల్స్, యాంటిఆక్సిడెంట్ల వల్ల అపారమైన ఫలితాలున్నాయి. ఇంకా పాలీఫెనాల్స్, టానిన్స్, యాంతోసియానిన్‌లు ఎక్కువగా ఉండే దానిమ్మ, గుండె ఆరోగ్యానికి మంచిది. ధమనులలో కొవ్వు పేరకుండా కాపాడుతుంది. బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. చక్కని కురులు కోరుకునే వారు క్రమం తప్పకుండా దానిమ్మను తింటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

**బీట్‌రూట్:** క్యారేట్లను ఆరగించినంతగా బీట్‌రూట్‌లను ఇష్టపడం. కానీ ఇందులో ఉన్న పోషకాల గురించి తెలిస్తే, క్రమం తప్పకుండా రుచిచూస్తాం. బీట్‌రూట్‌లో నైట్రేట్స్ ఎక్కువ. దీన్ని శరీరం నైట్రిక్ ఆసిడ్‌గా మారుస్తుంది. శరీరంలో రక్తప్రసరణ బాగా జరిగేందుకు, రిలాక్స్‌డ్‌గా ఉంచేందుకు ఇది తోడ్పడుతుంది. బీట్‌రూట్‌లోని ఎర్రని రంగుకు కారణం బెటలైన్స్ అనే శక్తిమంతమైన



యాంటీఆక్సిడెంట్స్. ఇది ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. ఇంకా కేన్సర్‌లాంటి వ్యాధులు దరిచేరకుండా రక్షిస్తుంది. వ్యాయామం చేస్తున్నప్పుడు గుండె, ఊపిరితిత్తులు సరిగా పనిచేయడానికి బీట్‌రూట్ రసం తోడ్పడుతుంది. బీట్‌రూట్‌లో ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇందులోని ఫైబర్ కారణంగా కడుపు ఉబ్బరం తగ్గుతుంది.

**భలే రుచి బెర్రీ:** చక్కెర, క్యాలరీలు తక్కువగా ఉండి ఫైబర్ ఎక్కువగా ఉండే పండు 'స్టాబెర్రీ'. ఈ పండు దోర ఎరుపురంగుకు కారణం ఇందులోని యాంథోసయానిన్ అనే



పిగ్మెంట్. రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచేందుకు ఇది సహాయపడుతుంది. హృదయాకారంలో ఉండే స్ట్రాబెర్రీ గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇంకా ఇందులోని పాలీఫైనాల్స్ మెదడు చైతన్యానికి మంచివి. మెదడును చురుకుగా ఉంచుతాయి. ఎక్కువగా ఫైబర్ ఉండడం వల్ల సాఫీగా జీర్ణమవుతుంది. అంతేకాదు రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రణలో ఉంచుతుంది. స్ట్రాబెర్రీల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి మధుమేహం ఉన్నవాళ్లకి మంచిదే. అయితే బెర్రీల అలర్జీ ఉన్నవారు మాత్రం వీటికి దూరంగా ఉంటేనే మేలు. మిగతా పళ్లతో పోలిస్తే వివిధ రకాలుగా

ఈ పళ్లను వాడే సౌలభ్యం ఉంది. తాజాగానే కాకుండా గడ్డకట్టిన, పొడిగా చేసిన, ఎండిన స్ట్రాబెర్రీలను కూడా తీసుకోవచ్చు.

**రంగుల క్యాప్సికమ్:** సూపర్‌మార్కెట్లలో నిగనిగలాడుతూ



ఇట్టే ఆకట్టుకునేది క్యాప్సికమ్. ఇందులో పసుపుపచ్చ, ఆకుపచ్చ, ఎరుపు..ఇలా రంగులెన్నో. అయితే ఎర్రని క్యాప్సికమ్‌ల వల్ల కలిగే లాభాలు అంతా ఇంతా కాదు. మిగతా వాటితో పోలిస్తే ఎర్రని వాటిలో విటమిన్ 'సి' అత్యధికం. అరకప్పు ఎర్రని క్యాప్సికమ్‌లో 95 మిల్లీగ్రాముల విటమిన్ సి ఉంటుంది. రోజూ తీసుకోవాల్సిన విటమిన్ సి మొత్తంలో అది 106 శాతం. మనం తీసుకున్న ఆహారంలోని ఐరన్‌ను శరీరం బాగా శోషించుకునేలా సహాయ పడుతుంది. అలాగే ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియంట్ల స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. విటమిన్ 'ఎ' శాతం కూడా ఎక్కువే కాబట్టి కంటి ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తికి, పునరుత్పత్తి తదితరాలకు ఎర్రని క్యాప్సికమ్ ఎంతో మేలు చేస్తుంది.

**పుచ్చకాయ చాలు:** వేసవిలో ఉపశమనం ఇచ్చే పుచ్చకాయలో విటమిన్ ఎ,బి,సి,ఇలతో పాటు లైసోపీన్ అధికంగా ఉంటుంది. కొలెస్ట్రాల్ తగ్గిం చేందుకు ఇది తోడ్పడు తుంది. గుండెను పదిలంగా కాపాడుతుంది. పుచ్చకాయలో సిట్రులిన్ అనే అమైనో ఆసిడ్ ఉన్నందు వల్ల రక్తపోటు నిలకడగా ఉండేలా సహాయపడుతుంది. పుచ్చకాయలో బీటా క్రిప్టోగ్జాంథిన్ అనే పిగ్మెంట్ ఉండడం వల్ల కీళ్లవాతం రాకుండా తోడ్పడుతుంది. ఓ చిన్న పుచ్చకాయ ముక్క 9-11 శాతం విటమిన్ 'ఎ'ను అందిస్తుంది. ఈ మొత్తం ఒకరోజుకు సరిపోతుంది. చర్మాన్ని సంరక్షించడంలో కూడా ఈ పండు ముందుం టుంది. నీటి శాతం, అమైనోఆసిడ్లు, యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్నందున వ్యాయామం చేసిన తర్వాత పుచ్చకాయ రసం తాగడం వల్ల ఎంతో ఉపయోగం. ❑




## తొలి హైడ్రోజన్ ఫ్లైయింగ్ ట్యాక్సీ



హైడ్రోజన్ ఇంధనంగా ఉపయోగించుకుని ప్రయాణించి తొలి ఫ్లైయింగ్ ట్యాక్సీ ఇది. విమానాలను తయారు చేసే అమెరికన్ కంపెనీ 'జోబీ ఏవియేషన్స్' ఇటీవల దీనికి రూపకల్పన చేసింది. ఇప్పటికే కొన్ని కంపెనీలు ఎగిరే కార్లను రూపొందించాయి. 'జోబీ ఏవియేషన్స్' ఆరు ప్రొపెల్లర్లతో రూపొందించిన ఈ ఫ్లైయింగ్ ట్యాక్సీ ఎటువంటి ఉపరితలం పైనుంచి అయినా, ఉన్న చోటు నుంచి నిట్టనిలువుగా పైకి ఎగరగలదు. ఇటీవల కాలిఫోర్నియాలో పరీక్షాత్మకంగా దీని ప్రయాణాన్ని నిర్వహించినప్పుడు, హైడ్రోజన్ ఇంధనంతో ఇది ఏకధాటిగా 902 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, ఇదివరకటి ఫ్లైయింగ్ కార్ల రికార్డులను బద్దలు కొట్టింది. దీని గరిష్ఠవేగం గంటకు 322 కిలోమీటర్లు. ఈ ఫ్లైయింగ్ ట్యాక్సీ రూపకల్పన కోసం అమెరికన్ సైన్యం కొంతవరకు నిధులు సమకూర్చినట్లు 'జోబీ ఏవియేషన్స్' వ్యవస్థాపకుడు, సీఈవో జోబెన్ బెవిర్ట్ వెల్లడించారు. రద్దీగా ఉండే పట్టణ ప్రాంతాల్లో ప్రయాణికులను ఒక చోటు నుంచి మరో చోటుకు తీసుకుపోయేందుకు ఇది బాగా ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. స్థానిక అవసరాలకు మాత్రమే కాకుండా, దేశాల మధ్య కూడా ఇది ప్రయాణించగలదని, దాదాపు 900 కిలోమీటర్ల వరకు దీనికి ఇంధనం నింపాల్సిన అవసరం ఉండదు.

## మనసున్న మరమనిషి

మనసున్న మరమనిషి ఇప్పటివరకు శాస్త్రవేత్తలు రకరకాల రోబోలను రకరకాల పనుల కోసం రూపొందించారు. అవన్నీ మనుషుల ఆదేశాలకు అనుగుణంగా యాంత్రికంగా పనిచేసుకుపోయేవే తప్ప వాటికంటూ ప్రత్యేకంగా భావోద్వేగాలేవీ ఉండవు. అవి ఉత్త మరమనుషులు, అంతే! అయితే, చైనా శాస్త్రవేత్తలు ఇటీవల ప్రపంచంలోనే తొలిసారిగా మనసున్న మరమనిషిని రూపొందించారు. ఈ రోబో పేరు 'పెప్పర్'. మనుషుల మాదిరిగనే ఈ రోబో కూడా ప్రేమ, సంతోషం, బాధ, కోపం వంటి భావోద్వేగాలను వ్యక్తం చేయగలదు. ఎదుటనున్న మనుషుల భావోద్వేగాలను గ్రహించి, అందుకు అనుగుణంగా నడుచుకోగలదు. షాంఘైలోని ఫుడాన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ రోబోను రూపొందించారు. పూర్తిగా మనిషంత పరిమాణంలో 5.4 అడుగుల ఎత్తు, 62 కిలోల బరువుతో వారు తయారు చేసిన ఈ రోబో తన భావోద్వేగాలను ముఖంలో పలికించగలదు. షాంఘైలో గతనెలలో దీన్ని ప్రదర్శించారు. ❑





# ఉనికి

దేనికీ దడవని ఉరుకు పరుగుల పయనమిది.
బెర్త్‌పై గురకలు పెట్టి పడుకొని
కలలుగంటున్న నా దేహం
రైలింజన్ కూతతో
దడేల్‌మని నిద్ర లేస్తుంది.
కులానికి రిజర్వేషన్ ఉందిగానీ..
సుఖ నిద్ర పోవడానికి ఈ జనరల్
కూపేలో
నాకు రిజర్వేషన్ లేదు.
ఇప్పటివరకు పరుగెడుతుంది
నేనే అనుకున్నాను..
కలల జీవితం కూడా నాతో పాటే
పరుగెడుతోందని తెలిసింది.
వాస్తవ పయనం నా చెప్పుచేతల్లోనే అనుకున్నాను.
కానీ కల కూడా నా చెప్పుచేతల్లో లేదని తెలిపింది.
ఇంతకీ నేను నేనుగా ఉన్నట్టా..
కలగా లేనట్టా!?

– చలపాక ప్రకాష్

పచ్చని అనుభూతులన్నీ
ఎండుటాకుల్లా రాలిపోతున్నాయి!
రావలసిన రైలుబండికోసం
ప్లాట్‌ఫామ్‌పై ఎదురు చూపులు
వేగ నియంత్రణ మన చేతుల్లో వున్నా
సిగ్నల్ దాటి రావాలని వున్నా
అధికారం జెండా మాత్రం ఊపదు.
ఎండి మండిపోతుంది
రాత్రి చీకట్లు కమ్ముకొని..
కీచురాళ్లు శబ్దం చేస్తుంటాయి.

## ఈవారం కవిత్వం



విశ్వం మొత్తం కవిత్వ ఇతివృత్తమే
అందులో అపరిమితం సముద్రం.
ఉన్నవారికి లేనివారికి ఉమ్మడాస్తి
అనునిత్య చైతన్య స్వరూపి సముద్రం.
విహారానికై తన తీరానికి చేరేవారిని
కెరటాల పన్నీరు చల్లి ఆహ్వానిస్తుంది సముద్రం.
అలుపెరుగని కెరటాల్తో నిత్య విప్లవ ఘోష
నినదించే ఒక శబ్ద కావ్యం మహాసముద్రం
ఈ అఖండ జలరాశి ఆకారానికే గాంభీర్యం
ప్రజల కోసం ఆవిరావిరై ఆకాశాన మేఘమై
వర్షమై జనహర్షమై కురుస్తుంది సముద్రం.
తన రుచి ఉనికికి ఉప్పయినా మంచినీటి
పుట్టుకకు కేంద్రం అవుతుంది సముద్రం.
అగాథమగు ఈ జలనిధి అట్టడుగున
ముత్యాల పగడాల రత్నాల రాశులతో
చేపల పాపల మందల కాశ్రయమిస్తూ
పైన ఓడల స్టీమర్ల నిండైన వెలుగులతో
రవాణా వ్యవస్థలతో దేశదేశాల్ని కలుపుతూ
జాలర్ల జీవనాల జవం పెంచుతూ
బహుళార్థ సాధక సార్థకం సముద్రం.
ప్రతి ఉదయం సూర్యుణ్ణి నిద్రలేపి భూభ్రమణ
పహారాకై పంపే సముద్రం తరతరాలకు
నిలిచే బోధనాంశం.
మనం బతికే చోటిచ్చి నిలిపే నేలతల్లిని
పంచభూతాల్ని నిర్లక్ష్యంగా కలుషితం చేస్తుంటే
సముద్రుడు చూస్తూ ఊరుకోడు!
వాయుగుండమై సునామీ జల ఖడ్గం
ఝుళిపిస్తాడు! జాగ్రత్త!!

ఎల్.రాజాగణేష్

# మంచి సముద్రుడు ముంచితే!



## పుస్తక సమీక్ష



## 'ముగ్గురు యోధులప్రదేశ్'

ఈ పుస్తకాన్ని ఉమ్మడి ఏపి రాష్ట్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వసంత నాగేశ్వరరావుకి అంకితం చేసారు రచయిత. దాదాపు 26 అంశాలపై సచిత్రాలతో ఈ పుస్తకం అందించారు. ఆంధ్రప్రదేశ్ సమాచారం,ఎన్‌టిఆర్ జీవిత చరిత్ర, అన్నా హజారే, ప్రముఖుల లేఖలు, ఆంధ్రప్రదేశ్ జిల్లాలు పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలు, ముఖ్యమంత్రుల ఫోటోలు, అయిదేళ్లలో పరిపాలన, వైఫల్యాలు విపులీకరించే వ్యాసాలు పాఠకుల్ని ఆలోచింపజేస్తాయి. జగన్‌పాలనలో ఉపాధికి సమాధి కట్టబడింది అంటారు ఈ రచయిత (పేజి,62), అలాగే డ్వాక్రాసంఘాలకు నిర్లక్ష్యం ద్వారా పల్లెలకు శరాఘాతం (పేజి.66) అంటారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎమ్మెల్యే అభ్యర్థి 40లక్షలు, ఎంపి అభ్యర్థి 95లక్షలు ఖర్చుపెట్టాలి. కాని తెలుగురాష్ట్రాలలో 20 నుండి 30 కోట్లు ఎమ్మెల్యే అభ్యర్థులు, 100 కోట్లుదాకా ఎంపి అభ్యర్థులు ఖర్చుపెడుతున్నారు. రాజ్యసభకు వెళ్లే అభ్యర్థులు అధినేతలకు వందకోట్లు దాకా సమర్పించుకొంటున్నారన్న అంశాన్ని ప్రస్థావించారు వర్ధిల్లుతున్న ధనస్వామ్యం వ్యాసంలో (పేజి.72). నల్లకుబేరుల చేతుల్లో దేశం బందీ అయ్యింది (పేజి:77)లాంటి అంశాలెన్నో చర్చించారు. బాగుంది. రాజకీయ అధ్యయనవాదులకు చక్కటి కరదీపిక ఈ చిన్న పుస్తకం. **(ముగ్గురు యోధులప్రదేశ్, రచన: తిప్పినేని రామదానప్పనాయుడు, వెల: రూ 100, ప్రతులకు: 15ఎ, 3-4-737/22, బర్కత్‌పుర, హైదరాబాద్)**

**- కె.ప్రసన్నకుమారి**

## అంబేడ్కర్ జీవిత చరిత్ర



డా॥బి.ఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్రను మూడు భాగాలలో 80 అధ్యాయాలుగా రచించిన డా॥కత్తి పద్మారావు, మొత్తం పదిభాగాలుగా రాయాలని సంకల్పించడం, జ్ఞానసముద్ర మథనమే. ఇప్పటికే డా॥అంబేడ్కర్, మీద 13 గ్రంథాలు రాసిన మహాకవి డా॥పద్మారావు అసాధారణ మేధా సంపన్నులు. డా.బి.ఆర్.అంబేడ్కర్, జ్ఞానసర్వస్వాన్ని ఔపోసనం పట్టిన మహారచయిత డా॥కత్తిపద్మారావు, భారతీయ సాహితీ శిఖరాగ్రాన, శతాధిక గ్రంథాలుగా దళిత సాహిత్యమే కాకుండా సామాజిక నిర్మాణ మౌలిక సిద్ధాంత జీవనాన్వేషణలను దర్శింపచేస్తున్నారు. కేవలం కవి, రచయితగానే కాకుండా దళితోద్యమ పోరాట నేతగా తెలుగునాట సుపరిచితులైన పద్మారావు, అంబేడ్కర్ అడుగుజాడలలో దళిత, బహుజన జీవన సంక్షేమానికి అవిశ్రాంతంగా అంకితమవుతున్నారు. లోకాయత ప్రచురణలు, తెలుగులో ఆలోచనాపరులైన మేధావుల అన్వేషణలకు పదునుపెట్టే మహోన్నత భావజాలానికి జీవం అందించే తాత్త్విక దార్శనిక గ్రంథాలు. ఈ అంబేడ్కర్ చరిత్ర మూడవభాగంలోని 40 అధ్యాయాలలో వ్యవసాయ, ఉద్యమం, కుల నిర్మూలన, మూలాల పరిశోధన, సాంకేతిక విప్లవ ప్రణాళిక విభిన్న దృక్కోణాలలో సామాజిక విప్లవ చైతన్యమూర్తి డా॥అంబేడ్కర్ విస్తృత ప్రామాణిక అంశాల అధ్యయన సాకల్యం డా॥పద్మారావు ప్రతిభావంతంగా దర్శింపచేసారు. **(అంబేడ్కర్ జీవిత చరిత్ర, రచన: కత్తిపద్మారావు, వెల: రూ 600, ప్రతులకు: అంబేడ్కర్ రీసెర్చ్‌సెంటర్, లోకాయత ప్రచురణలు, గుంటూరుజిల్లా)**

**- యర్రమిల్లి**

## చిట్టి, పొట్టి, గట్టి కథలు



కథకులుగా ఉండవల్లి ఎమ్. పాఠకలోకానికి చిరపరిచితులు. ఈసారి 'పిట్టరహస్యం' అన్న కథాసంపుటిలో 27 పొట్టి కథలతో మనముందుకు వచ్చారు. కొసమెరుపు కథలు (పిట్టరహస్యం, రాత్రి నడిచిన కథ, మిస్టరీ, జ్యోతిష్యఫలం) కొన్ని అయితే, నేటి సెల్‌ఫోను యుగం మీద సెటైర్ (4జికాం) ఫేస్‌బుక్ మీద మరో మంచికథ (ఫ్రెండ్ రిక్వెస్టు) మనల్ని అలరిస్తాయి. కథల్లో సున్నితమైన హాస్యం, ఆ హాస్యంతోనే మంచి సందేశం (జ్ఞానోదయం, మంచి చెడ్డబ్బాయ్, నేనొక, గుణపాఠం-కథలు) ఇస్తారు రచయిత. ప్రభుత్వపు 'జవాబుదారీతనం' మీద సెటైరులో ఆ ఫైలు ఎక్కడెక్కడో తిరిగి చివరాకరున ఆయన్నే చేరి ఆయనే సమస్యకు పరిష్కారం చూపాల్సి వచ్చింది. ఇది ఒకే ఒక పేజీతో ముగిసిన కథ. అయినా రచయిత ఇచ్చిన సందేశం ఆలోచనల్లో పడవేస్తుంది. బ్రహ్మంగాడి కథ, ఆమె ఒక...! ప్లీజ్..కథలు సరదాగా సాగుతూ నిత్యజీవిత సత్యాలను విడమర్చి చెబుతాయి. సరదాకథలే కాదు, సీరియస్ కథలు అల్లటంలో దిట్ట అనిపించుతాయి. ఒక ప్రస్థానం గుండెకింద తడి చదివాక, విడవక చదివించే శైలి. అంతర్లీనంగా ఇచ్చే మంచి సందేశాలు కథల ప్రత్యేకత. **(పిట్ట రహస్యం, రచన: ఉండవల్లి ఎమ్, వెల: రూ 100, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

**- కూర చిదంబరం**

## సహజత్వానికి దగ్గరగా..వంజారి కథలు



'నల్లసూరీడు' తరువాత 27 కథలతో రోహిణి వంజారి వెలువరించిన మలి కథల సంపుటి 'విజయ మహల్ సెంటర్'. నెల్లూరు పట్టణం నడిబొడ్డునగల 'విజయమహల్ కూడలి' చుట్టూ పరిభ్రమించిన కథలు యివి. నెల్లూరు ప్రాంతపు భాషా పరిమళాలను పోహళించి వడ్డించారు రచయిత్రి. పోగొట్టుకున్నది పావలేయ్ కావొచ్చు. కాని సంపాదించినవాడి దృష్టిలో అది వజ్రంతో సమానం. డబ్బు విలువను తెలియజేసిన కథ 'వొజ్రం విలువ'. ఆకలికి కులం లేదని చెప్తుంది 'లలితమ్మ హోటల్' కథ. మనుషుల మలమూత్రాలను (కక్కసులు) చేత్తో ఎత్తిపోసే పారిశుధ్య కార్మికుల సేవలు ఈతరం వారికి తెలియకపోవచ్చు. కాని రోహిణి తను ఏడవతరగతి చదివే లోపు జరిగిన సంఘటనను కథీకరించిన తీరు 'కర్పూరదీపం' లో కడు హృద్యంగా అలరిస్తుంది ఆనాటి అలాంటి కార్మికులు నరసమ్మ. ఒక్కరోజు ఆమె రాకపోయినా గ్రామస్థుల ఇంటి పరిసరాలు దుర్గంధభరితమై నివాసయోగ్యతను కోల్పోతాయి. అలాంటిది ఆమె కొద్దిరోజులుగా రాకపోతే? కారణం? ఆమె మరణం. తర్వాత ఏమి జరిగిందో తెలియాలంటే 'కర్పూరదీపం' కథ చదవాల్సిందే.చదవండి..ఒక్కో కథ ఒక్కో అనుభూతినిస్తుంది. **(విజయ మహల్ సెంటర్, రచన: రోహిణి వంజారి, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు)**

**- రమణ వెలమకన్ని**



# దుబాయ్ చూసొద్దామా!

షేక్ అబ్దుల్ హకీం జాని

**ప్రపంచంలోనే** అతిపెద్ద పిక్చర్ ఫ్రేమ్‌గా ఇది రికార్డు కలిగివుంది. దుబాయ్‌లో ఉన్న ఈ ఫ్రేం అంటే సినీ ప్రముఖులు సైతం ఇష్టపడతారు. హీరోలు, హీరోయిన్‌లు సైతం దీని ముందు నిలబడి ఫోటోలు దిగుతుంటారు. బంగారు వర్ణంతో మెరిసే ఈ అతిపెద్ద ఫ్రేం పొడవు 150.24 మీటర్లు, వెడల్పు 93.53 మీటర్లు. ఎత్తైన ఈ ఫ్రేం ముందు నిలబడితే ఎవరికైనా రాజసం ఉట్టిపడుతుంది. 2013లో దీని నిర్మాణం ప్రారంభించారు. 1 జనవరి 2018న ప్రల సందర్శనార్థం ప్రారంభించారు. ఇది ఊరికే నిలబడి ఫోటోలు దిగడానికి మాత్రమే నిర్మించలేదు. లిఫ్ట్ సహాయంతో దీనిపైకి వెళ్ల దుబాయ్ నగరాన్ని విహంగవీక్షణం చేయవచ్చు. దుబాయ్‌లోని ఈ బంగారు ఫ్రేం పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. ఇక్కడ ఫొటో దిగాలంటే యాభై ఎమిరేట్ అనేక తెలుగు సినిమా షూటింగ్‌లు ఇక్కడ జరిగాయి. ఆ సందర్భాలలో నటీనటులు ఈ గోల్డ్ ఫ్రేం ముందు ఫోటోలు దిగి సామాజిక మాధ్యమాలలో షేర్ చేయగా అవి వైరల్ అయ్యాయి. అరబ్బులు గర్వకారణంగా భావించే బూరు ఖలీఫా, పాం జుమేరియా తరువాత ఈ నిర్మాణానికి మంచి పేరు వచ్చింది. ఇటువంటి బంగారు ఫ్రేం నిర్మించడం పేద దేశాలకు సాధ్యం కాకపోవచ్చు. కనీ డబ్బు, బంగారం వరదలాపారే దుబాయ్ దేశంలో ఇటువంటి బంగారు ఫ్రేమ్‌లు నిర్మించడం అతి సులవైన పనే అని పరిశీలకులు చెబుతుంటారు. పైఅంతస్తుల్లో అబ్జర్వేషన్ డెక్ ఉంది. దీన్ని శరవేగంతో పరుగులు తీసే లిఫ్ట్‌లో సెకన్లలో చేరుకోవచ్చు. పైభాగంలో గ్లాస్‌ఫ్లోర్ ఉంది. అతి దృఢంగా ఉండే ఈ క్రిస్టల్ రాజు మార్గంలో నడుస్తుంటే ఆకాశంలో నడుస్తున్న అనుభూతి కలుగుతుంది. గోల్డ్‌ఫ్రేం పై అంతస్తు నుండి దుబాయ్ నగర విహంగ వీక్షణం చేయవచ్చు. గోల్డ్ ఫ్రేంలోని దుకాణాలలో గోల్డ్‌ఫ్రేం నమూనాలు అమ్ముతుంటారు. దుబాయ్ గోల్డ్ ఫ్రేమ్ రాత్రిపూట విద్యుద్దీపాల కాంతితో పలు వర్ణాలలో కనిపిస్తుంది. ఒక ఫ్లోర్‌లో 2050లో దుబాయ్ ఏ విధంగా ఉండబోతుందనే ఊహా దృశ్యాలను అతిపెద్ద మానేటర్‌పై ప్రదర్శించడం అద్భుతంగా ఉంటుంది.

## పామ్ జుమేరా ద్వీపం

ఇసుక రాళ్లతో ఈ దీవిని దుబాయ్‌లోని అరేబియా మహాసముద్రంలో 5.72 చదరపు కి.మీ విస్తీర్ణంలో నిర్మించిన కృత్రిమ ద్వీపం. పామ్ జుమేరా ద్వీపాన్ని ఆకాశం నుండి విహంగ వీక్షణం చేస్తూ చూస్తే పరమాద్భుతంగా ఉంటుంది. ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన హోటళ్లు, మాల్స్, విల్లాలు, బీచ్ క్లబ్బులు, స్విమ్మింగ్‌పూల్స్, రెస్టారెంట్లు ఇక్కడ ఉన్నాయి. పామ్ జుమేరా ఖర్జురపు చెట్ల ఆకారంలో మానవ నిర్మిత పరమాద్భుత కృత్రిమ దీవి. దీని నిర్మాణానికి 12 బిలియన్ల అమెరికన్ డాలర్లు ఖర్చు చేశారు. ప్రతి విల్లాకు సముద్ర బీచ్ ఉండటం ఇక్కడి విశేషం. వీటిని 17 రెక్కలుగా సముద్రం జలాలపై చంద్రవంకా ఆకారంలో నిర్మించారు. ఈ మహత్తర నిర్మాణంలో భారతీయులు కూడా కార్మికులుగా పనిచేశారు. ప్రస్తుతం అనేకమంది భారతీయులు ఇక్కడ జీవనం పొందుతున్నారు. అలల తాకిడికి ఎదుర్కొని నిలబడేలా దీన్ని నిర్మించారు. 2001లో దీని నిర్మాణం పనులు చేపట్టారు. ఆరేళ్లల్లో మొదటి విడత కొంతమేరకు నివాసయోగ్యంగా తీర్చిదిద్దిరు. 2009 నాటికి దాదాపు 28 హోటళ్లు ఇక్కడ సిద్ధమైనాయి. 2003లో వాటర్ థీమ్ పార్క్, ఒక 'సీ విలేజ్' ఇత్యాది అనేక నూతన నిర్మాణాలు చేసి పునఃప్రారంభించారు. ఇక్కడ మూడు విభాగాలుగా చూడవచ్చు. పామ్ జుమేరాతో పాటు పామ్ జెబెల్ అలీ, పామ్ డీరా కూడా ఉన్నాయి. ఇంకా చాలా నిర్మాణాలు జరగవలసి ఉంది. అనేక పనులు అసంపూర్ణంగానే ఉన్నాయి. ఈ ప్రదేశాన్ని 'గేట్‌వే టు అట్లాంటిస్', 'బెవర్లీ హిల్స్ ఆఫ్ ది మిడిల్ ఈస్ట్'గా కూడా పిలుస్తున్నారు. మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు డేవిడ్ బెక్‌హామ్, బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్‌ఖాన్ వంటి ప్రముఖులు ఇందులో



సొంత భవనాలను కలిగి ఉన్నాయి. పామ్ జుమేరాను నిర్మించడానికి హాజర్ పర్వతాల నుండి సేకరించిన ఏడు మిలియన్ టన్నుల బండరాళ్లు, 120 మిలియన క్యూబిక్ మీటర్ల ఇసుకను ఉపయోగించారు. దీని నిర్మాణంలో ఉక్కు, కాంక్రీట్ ఉపయోగించలేదు. ఈ ద్వీపం 5.72 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మించారు. అంటే దాదాపు 600 ఫుట్‌బాల్ పిచ్‌లంత పెద్దది. ప్రస్తుతం ఈ ప్రదేశాన్ని విహంగ వీక్షణం చేస్తే ఖర్జురపు చెట్టు ఆకారంలో కనిపిస్తుంది. ప్రపంచపటం ఆకారంలో దీన్ని రూపొందించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రస్తుతం కృత్రిమ ద్వీపం పామ్ జుమేరా వేలమంది ప్రజలకు నివాసయోగంగా ఉంది. ప్రపంచం నలుమూలల నంఉడి పర్యాటకులు అనునిత్యం ఇక్కడకు వచ్చి ఉల్లాసంగా గడిపి వెళుతుంటారు. అపార్ట్‌మెంట్‌లు, అనేక హోటళ్లు ఇక్కడ ఉన్నాయి. చాలావరకు రిసార్టులు, హోటళ్లు చంద్రవంకలు ఉన్నాయి. అయితే చాలా దగ్గరగా ఉండే విల్లాలు పొడవాటి అంచులను కలిగి ఉంటాయి

## గ్లోబల్ విలేజ్

దుబాయ్‌లో తప్పక సందర్శించదగిన పర్యాటక ప్రదేశం గ్లోబల్ విలేజ్. దీన్ని 1997లో ర్మించారు. అత్యుత్తమ వినోదానికి ఇది ప్రధాన కేంద్రం. షాపింగ్‌లు, భిన్న సంస్కృతులు, విభిన్న రకాల వంటలు ఒకటేమిటి ప్రపంచమంతా కళ్లముందున్న భావన కలుగుతుంది. ఇందులో 195 రైడ్‌లు, గేమ్‌లు, నైపుణ్యాన్ని పెంచే ఆటలు ఉంటాయి. ఇక్కడి మినీ వరల్డ్‌లో తాజ్‌మహల్, రోమ్‌లోని కలోసియం, న్యూయార్క్‌లోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ ఇలా 25 నమూనాలు కళ్లకు కట్టినట్లు ప్రదర్శిస్తునానరు. వీధుల్లో ప్రదర్శనలు, పిల్లల కోసం మిక్కీమౌస్ వంటి ప్రదర్శనలు ఇత్యాది అనేక అద్భుతాలు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తాయి. ప్రపంచ దేశాలు అన్నీ ఒక్కచోట ఉంటే అదే 'గ్లోబల్ విలేజ్'. తొంభై దేశాల సంస్కృతులు, సంప్రదాయాలు ఒక్కచోట చూసే అవకాశం ఇక్కడ కల్పించారు. దుబాయ్‌లోని షేక్ మొహమ్మద్ బిన్ జాయేద్ రోడ్డులో ఈ గ్లోబల్ విలేజ్ ఉంది. పర్యాటకులు ఈ ప్రాంతం మొత్తాన్ని సందర్శించాలంటే కనీసం ఒకరోజు పడుతుంది. షాపింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారులు ప్రదర్శించే రోమాలు నిక్కపొడిచే షోలు, లైవ్ ఈవెంట్స్ ఉంటాయి. బాణాసంచా ప్రదర్శన, ఫాంటసీ ద్వీపం, బహుళ రుచుల వంటకాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఒక చిన్నసైజు ప్రపంచమే మన కళ్లఎదుట నిలుస్తుంది. ప్రతి సంవత్సరం 9మిలియన్ల పర్యాటకులు దీన్ని సందర్శిస్తారని అంచనా.

## దుబాయ్‌లో మిరాకిల్ గార్డెన్

ప్రపంచంలోనే అతిపెద్ద పూల ఉద్యానవనం దుబాయ్ దేశంలో ఉంది. ఈ ఉద్యానవనాన్ని 'మిరాకిల్ గార్డెన్'అని పిలుస్తారు. ఇది మహాద్భుత పుష్ప ప్రపంచం. దాదాపు 50 మిలియన్ల పూలను ఇక్కడ మనం చూడవచ్చు. ప్రపంచ పర్యాటకుల కోసం 2013లో ప్రేమికులదినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ మిరాకిల్ పూల ఉద్యానవనాన్ని 72000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దుబాయ్‌లో ప్రారంభించారు. నేడు ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సహజ పూలతోటగా భాసిల్లుతుంది. ఇక్కడ 250 మిలియన్ల మొక్కలు ఉన్నాయ. దుబాయ్‌లో మిరాకిల్ గార్డెన్‌ను పరివిల్లు గార్డెన్ (రెయిన్‌బో గార్డెన్) అని కూడా పిలుస్తుంటారు. దుబాయ్‌లోని మిరాకిల్ గార్డెన్స్ ఇప్పటివరకు మూడు పర్యాయాలు, మూడు విభాగాలలో గిన్నిస్‌వరల్డ్ రికార్డులో స్థానం పొందింది. ప్రపంచంలో తోట పనుల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకున్న సంస్థ ఇదే అని తెలుస్తుంది. జుమేరియా మసీదు, అల్-ఫహిదీ ఫోర్ట్, పామ్ జుమేరియా అట్లాంటిస్ హోటల్, సముద్రతీరం వెంట నిర్మించిన కృత్రిమ కాలువ నగరం దుబాయ్ మెరీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దుబాయ్‌మాల్ అద్భుతంగా ఉంటుంది. ఇది పర్యాటకుల్ని మరో ప్రపంచంలోకి తీసుకుని వెళుతుంది. ఇందులో దొరకని వస్తువు ఉండదు. కృత్రిమ జలపాతాలు, వాటిపై నుండి మనుషులు ఈదుతూ వస్తున్న దృశ్యాలు సహజంగా ఉంటాయి. ముఖ్యంగా మాల్‌లోపలి పైకప్పున దుబాయ్‌లోని అద్భుత కట్టడాల నమూనాలు తల్లకిందులుగా వేలాడుతున్నట్లు అద్భుతంగా రూపొందించారు. కృత్రిమమైన స్కీయింగ్‌తో పాటు వినోద కేంద్రాలు, ప్రపంచంలో అతిపెద్ద బంగారు దుకాణాలలో అరుదైన ఆభరణాల షాపింగ్, సున్నపు రాయితో నిర్మించిన చారిత్రాత్మక భవనం బస్టాకియా, డాల్ఫిన్ చేపల విన్యాసాల దుబాయ్ డాల్ఫినారియం, డాల్ఫిన్ చేప ఆకారంలో ఉండే భవనాలు, కైట్‌బీచ్, కృత్రిమ జలపాతాలు, సర్ఫింగ్ మెషిన్స్, వాటర్‌స్లైడ్స్ ఇలా చెప్పుకుంటూ పోతే పర్యాటకులను మరో ప్రపంచంలోనికి తీసుకుని వెళ్లేవింతలు, విడ్డూరాలు దుబాయ్‌లో అనేకం ఉన్నాయి. పర్యాటకుల అనేక సాహసక్రీడల్లో పాల్గొనవచ్చు. పెద్ద రోప్‌వేపై వేలాడుతూ ఈ కొన నుండి ఆ కొన వరకు వెళ్లే జిప్‌లైనింగ్ ఒక వింత అనుభూతిని మిగుల్చుతుంది. ఎడారిలో భారీ టైర్ల కారును నడుపుకుంటూ వెళ్లే డ్యూస్‌బగ్గీ, నీళ్లలో ఉండే బోర్డింగ్ ఒకటి మనిషిని గాల్లోకి లేపుతూ అటూ, ఇటూ తిప్పి మరో వింత లోకానికి తీసుకుని వెళ్లే హైడ్రోఫ్లైయింగ్ అని పిలిచే ఫ్లైబోర్డింగ్ క్రీడ, హెలికాప్టర్‌లో దుబాయ్ నగర విహంగవీక్షణం, ఎడారిలోని ఇసుక తెన్నెల్లో జారుకుంటూ వెళ్లే సో బోర్డింగ్‌ను పోలిన సాండ్ బోర్డింగ్, ఎడారిపైన, సముద్రంపైన ఆకాశంలో విహరించే స్కైడ్రైవింగ్, మోటారు సైకిల్‌ను పోలిన బోట్‌పై ప్రేమికులు శరవేగంతో దూసుకుపోతే సముద్ర జలాలపై చేసే జెట్‌స్కైయింగ్, ఎడారి ఇసుక తిన్నెలపై జెట్ స్పీడ్‌తో దూసుకుపోయే కార్లలో ప్రయాణం చేస్తూ చేసే సాహజ క్రీడసాండ్ బాషింగ్, హాట్ ఎయిర్ బెలూన్స్‌లో ఆకాశంలో ప్రయాణిస్తూ దుబాయ్ విహంగ వీక్షణం ఇత్యాదివి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి.



**(మిగతా 19వ పేజీలో)**





కథ

# ఐక్యంగా ఉంటాం

కోసల దేశాన్ని మణివర్మ పాలిస్తున్నాడు. అంతవరకు తమ వారసులు పాలించేవారు. మణివర్మకు అంతా కూతుళ్లే జన్మించారు. కుమారుడి కోసం చూసి, చూసి ఆరుమంది కూతుళ్లను కన్నాడు. దురదృష్టం చివరి కూతురు పుట్టగానే రత్నప్రభ మహారాణి కన్నుమూసింది. పిల్లలు అందరూ యుక్తవయసుకు వచ్చారు. రాజుకు వయోభారం మీద పడింది. అందరికీ వివాహాలు చేసి సమర్థుడైన అల్లుడికి రాజ్యం ఇవ్వాలని రాజు ఆలోచన. ఈ విషయమే తన కూతుళ్ల వద్ద ప్రస్తావించడానికి వారి అభిప్రాయాలు కనుక్కోవడానికి వెళ్లాడు. నాన్నను చూడగానే 'రండి నాన్నగారు' అంటూ స్వాగతం పలికారు ఆరుగురు కూతుళ్లు. వాళ్లను చూసి చిరునవ్వు నవ్వాడు మణివర్మ. 'అమ్మా మీకో విషయం చెప్పాలి' అన్నారు. 'చెప్పండి నాన్నగారు' అంటూ అందరూ ఒకేసారి అడిగారు. 'మిమ్మల్ని వివాహం చేసుకోవడానికి ఆరుదేశాల యువరాజులు ముందుకు వచ్చారు అని మనమంత్రి చెప్పారు' అన్నాడు రాజు.

'మీరు ఏమన్నారు?' అడిగింది పెద్ద కూతురు దీప. 'వారి అందరికీ అన్ని విద్యలు వచ్చు, ఈ సువిశాల రాజ్యం' అంటుండగానే రెండవ కూతురు కల్పించుకుని అందరం ఇక్కడే ఉంటే సరి' అంది. మణివర్మ గడ్డం కింద చేయి పెట్టుకుని, 'అందరూ ఇల్లరికం ఉండాలంటారు' అన్నాడు మణివర్మ.

'అవును నాన్నగారు మేమందరం ఐక్యతతో ఉంటాం. ముఖ్యంగా మన కోసలదేశం ప్రజల కోసం, వారి సంక్షేమం కోసం అందరం కలిసి కట్టుగా ఉంటాం' అంది మూడవ కూతురు విజయ. ఆ మాటకు మిగిలిన ముగ్గురూ తలలు ఆడించారు. మణివర్మకు ఆ మాట కూతుళ్ల దగ్గర నుంచి విన్న తరువాత వారి ఐక్యతకు చాలా సంతోషించాడు. లేకపోతే తన రాజ్యం ఒకరికే ఇవ్వాలి అనే ఆలోచన అతనిది. దానివల్ల కూతుళ్లు, అల్లుళ్లమధ్య మనస్పర్థలు వస్తాయని ఆలోచించలేకపోయాడు. ఇప్పుడు కూతుళ్లే ఆ మాట అంటుంటే ఆనందానికి అంతులేకుండాపోయింది. అందరి కూతుళ్లను దగ్గరకు తీసుకుని నదుటిపై ముద్దుపెడుతూ 'మీరు మన కోసల దేశం ప్రజల గురించి ఆలోచించడం నాకు నచ్చింది. ఇక అందరికీ ఒకేరోజు ఒకే ముహూర్తానికి వివాహాలు జరిపిస్తా. మన కోసల దేశపు అల్లుళ్ల సింహాసనం అనేది లేకుండా సరి సమానంగా వాళ్ల ఆసనాలపై ఉండి రాజ్యపాలన చేస్తారు అదే మీకు చెప్పాలని వచ్చాను' అన్నాడు. 'వెంటనే వివాహానికి కబురు పెట్టండి' అంది చిన్న కూతురు చిత్ర. దానికి అందరూ నవ్వారు.

మణివర్మ, మంత్రిని కలిసి 'మహామంత్రి ఇప్పుడు నా సమస్య తీరింది మన కోసల దేశాన్ని పాలించడానికి ఇప్పుడు ఒకరు కాదు ఆరుమంది ఉన్నారు. వారికి తోడు మన అమ్మాయిలు ఉన్నారు' అన్నాడు. దానికి మహామంత్రి 'మంచిది మహారాజా రేపే వివాహానికి కబురు పెడతాను.' అన్నాడు.

మణివర్మ 'మహామంత్రి ఓ మాట , వీరికి వివాహం చేసి, అల్లుళ్లకు రాజ్యభారం ఇచ్చి మనం తీర్థయాత్రలకు పోదాం' అన్నాడు.


'సరే మహారాజా' అని వెళ్లాడు. ఒకే శుభముహూర్తంలో కోసల దేశపు ప్రజల మధ్య వివాహం ఘనంగా జరిగింది. అల్లుళ్లు కూడా మంచి పాలనాధక్షులు కావడంతో కోసల దేశాన్ని ప్రజారంజకంగా పాలించారు. నిర్ణయాలు తీసుకోవడంతో అందరూ ఏకీభవించేవారు. వారి పాలన స్వయంగా చూసిన రాజు మంత్రి 'మేం తీర్థయాత్రలకు వెళుతున్నాం. కోసల దేశపు ఔన్నత్యం మీరు నిలపాలి ఆ నమ్మకం, విశ్వాసం మాకు ఉంది' అన్నాడు మహారాజు. 'మీరు ఏ దిగులు పెట్టుకోకండి కోసల దేశపు ప్రజలను మా కన్నబిడ్డల మాదిరి చూసుకుంటాం' అన్నారు అల్లుళ్లు.

'అవును నాన్న' అని వంతపాడారు కూతుళ్లు.

– కనుమ ఎల్లారెడ్డి









## బాలగేయం

### విజయం

లేదు లేదు లేనే లేదు
విజయానికి లేదు దగ్గరిదారి
పట్టుదలతో కృషి
చేయడమే
విజయానికి ఉన్న
ఏకైక మార్గం
నిలబడి పైకి
చూస్తూ ఉంటే
ఎక్కలేవు ఉన్నత శిఖరం
జాగు చేయక
బయలుదేరితే
ఒక్కొక్క మెట్టును
ఎక్కేయగలవు
ప్రయత్నంలోనే సగం
విజయం ప్రయాణంలో
అంతా జయమే తొలి అడుగే
విజయ పునాది
ఆగక కదిలితే
విజయం నీదే
ఏదో జరుగునని
వెనుకకు చూడకు
వెరవక బెదరక
ముందుకు అడుగేయి
కష్టాలు నష్టాలు
కాసేపే ఉంటాయి
విజయం ముందు
అవన్నీపోతాయి.

– డా॥దార్ల బుజ్జిబాబు

## హాలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**– పి.అద్వైత,** గద్వాల

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కొండలు నీలంగా కనిపిస్తాయి. ఎందువల్ల?**

**జవాబు: అద్వైత!** నీలం వర్ణంలో వుండే పర్వతం అనే అర్థంలో 'నీలగిరి'ని వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి నీలగిరి మాత్రమే కాదు, దూరం నుంచి చూస్తే పర్వత శ్రేణులన్నీ నీలం రంగులోనే కనిపిస్తుంటాయి. కొండలు, పర్వతాల మీద ఉన్న పచ్చటి మొక్కలు, సూర్యకిరణాల కాంతిలో ఒకానొక రంగు అయిన ఎరుపు రంగును శోషించుకోవడమే ఇందుకు కారణం. అంతేకాదు, కొండల మీద ఉన్న చెట్లు, మొక్కల ఆకులు కొన్ని రసాయనిక మిశ్రమాలను వెలువరిస్తుంటాయి. ఈ మిశ్రమాలు త్వరితగతిన ఆవిరిగా మారిపోతుంటాయి. ఇవన్నీ ఒక పొరలా ఉండి తమ మీద పడే సూర్యకాంతి కిరణాలలోని నీలం రంగును పరిరక్షిస్తుంటాయి. ఈ నీలం రంగు మనం చూసే ప్రాంతానికీ, ఆ కొండకు నడుమ వున్న దూరాన్ని అనుసరించి ఎక్కువ తక్కువ స్థాయిల్లో ఉంటుంది.

**– సి.కరుణశ్రీ,** నిడదవోలు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నిద్రలేకపోతే కళ్లు ఎందుకు ఎర్రగా కనిపిస్తాయి?**

**జవాబు: కరుణశ్రీ!** మనకు కనిపించే దృష్టి వెనుక కండరాల చర్య ఎంతో ఉంది. మన కంటికి కనిపించినంత మేరలోని వస్తువులపై దృష్టిని కేంద్రీకరించడానికి కండరాలు అవసరం. మనం ఒక వస్తువు మీద దృష్టిని ఏకాగ్రతంగా వుంచినప్పటికీ కన్ను స్థిరంగా ఉండక చిన్నచిన్న కదలికలు చేస్తుంది. ఈ చర్యను కొనసాగించడానికి, కండరాలకు శక్తినివ్వడానికి అవసరమైన రక్తాన్ని సరఫరా చేసేందుకు, కంటిలో కేశనాళికల నెట్‌వర్క్ ఉంటుంది. ఈ కండరాలు అలసిపోయినప్పుడు లేక నిద్రలేమి కారణంగా ఎక్కువగా శ్రమించినప్పుడు అదనపు ఆక్సిజన్ చేరడానికి అధిక రక్తం సరఫరా అవసరమవుతుంది. ఈ అదనపు రక్తం సూక్ష్మమైన కేశనాళికల గుండా ప్రవహించినప్పుడు, కేశనాళికల నెట్‌వర్క్ ఎరుపు రంగుకు మారుతుంది.



# అనకాపల్లి బెల్లం

అనకాపల్లి పేరు చెబితే ఠక్కున బెల్లం గుర్తుకు వస్తుంది. ఈ బెల్లంకు దేశంలో మంచి గిరాకీ ఉంది. దేశంలో రెండవ అతి పెద్ద మార్కెట్‌గా దీనికి గుర్తింపు ఉంది. అనకాపల్లి బెల్లం మార్కెట్ విస్తీర్ణం 32 ఎకరాలలో ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ తర్వాత దేశంలో అనకాపల్లి రెండవ స్థానంలో ఉంది ఈ మార్కెట్. 12 నుంచి 16 కేజీల బరువులో బెల్లం దిమ్మలను రైతులు తయారు చేస్తారు. భారతదేశంలో అన్ని ప్రాంతాలకు ఇక్కడ నుంచే ఎగుమతులు జరుగుతుంటాయి. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఇక్కడ బెల్లం ఎగుమతి అవుతుంది. అనకాపల్లి మార్కెట్‌కు వచ్చే బెల్లంలో 80 శాతం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. ప్రతి ఏటా నవంబరు నుంచి ఏప్రిల్ వరకూ బెల్లం సీజన్ నడుస్తుంది. అయితే బెల్లం మార్కెట్‌కు వచ్చే బెల్లం దిమ్మల సంఖ్య ఏటా తగ్గుతుండడం



ఆందోళనకరం. చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోతుండడం, గిట్టుబాటు ధర లేకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. ఈ మార్కెట్‌లో ఒకప్పుడు సుమారు 150 కోట్ల వరకూ వ్యాపారం జరిగేది. తర్వాత ఈ హవా తగ్గుకుంటూ వస్తుంది. 120 ఏళ్ల చరిత్రఉన్న అనకాపల్లి బెల్లం మార్కెట్ వైభవం కనుమరుగు కానుందా? ప్రస్తుత పరిస్థితులు అలానే కనిపిస్తున్నాయి. 2016-17 సీజన్‌లో అత్యధికంగా 146 కోట్ల వ్యాపారం జరిగింది. 2018 నుంచి 2021 మార్చి సీజన్ వరకూ 91 కోట్ల నుంచి 77 కోట్లకు పడిపోయింది. ఉత్తర కోస్తా జిల్లాలలో ఎక్కడికక్కడ మార్కెట్లు పుట్టుకురావడంతో బెల్లం మార్కెట్‌కు తక్కువగా వస్తుంది.

## చెరకు సాగు తగ్గుముఖం

అనకాపల్లి జిల్లాలో చెరకు సాగు ప్రధానమైన పంటగా ఉండేది. రైతులు బెల్లం గానుగ ఆట ఆడి బెల్లం దిమ్మలను తయారు చేసి మార్కెట్‌కు పంపడం చేసేవారు. మరి కొంతమంది రైతులు జిల్లాలో ఉన్న తుమ్మపాల, గోవాడ, ఏటికొప్పాక, తాండవ చక్కెర కర్మాగారాలకు చెరకు సరఫరా చేసేవారు. అయితే సహకార చక్కెర కర్మాగారాలకు ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లభించని కారణంగా అప్పుల ఊబిలో కర్మాగారాలు కూరుకుపోయి దివాలా దిశగా పయనిస్తున్నాయి.

అలాగే బెల్లం మార్కెట్‌లో బెల్లంకు మంచి మద్దతు ధర లభించకపోవడం, చెరకు సాగు వ్యయం పెరిగిపోవడం, పంటకు పసుపు తెగులు వ్యాపించి దిగుబడి పడిపోవడం, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టాలు సంభవించడం వంటి కారణాల వలన క్రమేణా చెరకు సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతూ వస్తుంది. గతంలో జిల్లాలో 45వేల హెక్టార్లలో చెరకు పంట పండించేవారు. ప్రస్తుతం 34వేల హెక్టార్లకు పడిపోయింది. ఈ కారణంగా ప్రతి ఏటా మార్కెట్‌కు వస్తున్న బెల్లం సంఖ్య తగ్గుతూ వస్తుంది.

## ప్రమాదకరంగా బెల్లం రంగులు

అనకాపల్లి మార్కెట్‌లో బెల్లం రంగుకు కొనుగోలు వ్యాపారులు అధిక ప్రాధాన్యత ఇస్తారు. తెలుపు, బంగారపు రంగులో ఉన్న బెల్లంను మొదటి రకంగా గుర్తించి కొనుగోలు చేస్తారు. తర్వాత రెండు, మూడు స్థానాలలో ఉన్న వాటికి తక్కువ ధరతో కొనుగోలు చేస్తారు. బెల్లానికి ఎంత మంచి రంగు ఉంటే అంత మంచి సరుకుగా భావించడంతో బెల్లం తయారీలో అక్రమాలు జరుగుతున్నాయి.

వాస్తవానికి నాణ్యమైన బెల్లం కాస్త నలుపు రంగులో ఉంటుంది. అయితే దీనికి అంతగా ధర పలకదు. బెల్లం బంగారు రంగులో కనిపించేందుకు సోడియం, హైడ్రోజన్ సల్ఫేట్ వంటి రసాయనాలు బెల్లం తయారీలో వినియోగిస్తారు. అటువంటి బెల్లం ఆరోగ్యానికి చేటు తెస్తుంది. క్వింటాల్ బెల్లం తయారీలో 7 గ్రాములకు మించి సల్ఫర్‌ను వినియోగించకూడదు. సల్ఫర్ పెరిగే కొద్దీ బెల్లంలో తేమ పెరుగుతుంది. తేమ ఎంత పెరిగితే అంత త్వరగా బెల్లం నీరు కారిపోతుంది. దీంతో సూక్ష్మక్రిములు దీనిలో చేరుతాయి. ఈ కారణంగా విదేశాలకు అనకాపల్లి బెల్లం ఎగుమతి కావడంలేదు. టాంజానియా, మలేషియా, ఒమన్, కెనడా దేశాలకు ఎక్కువగా ఎగుమతులు జరిగేవి. అయితే అనకాపల్లి బెల్లం త్వరగా నీరు కారిపోవడంతో దిగుమతులు పడిపోయాయి. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి మాత్రమే ఎగుమతులు జరుగుతున్నాయి.

## ఆన్‌లైన్ ట్రేడింగ్

మార్కెట్‌కు దిమ్మలు రూపంలో వచ్చిన బెల్లాన్ని మార్కెట్ కమిటీ ఉద్యోగి సమక్షంలో వేలం పాట నిర్వహిస్తారు. ఎగుమతులు చేసే వ్యాపారులు ఈ వేలంలో పాల్గొని బెల్లం కొనుగోలు చేస్తారు. బెల్లం యూనిట్ ధరగా పది కేజీల చొప్పున వేలం నిర్వహిస్తారు. హెచ్చు పాట పాడుకున్న వ్యక్తి పేరు, దిమ్మల సంఖ్య, ధర నమోదు చేసుకుంటారు. తర్వాత బెల్లాన్ని కొలగార్లు తూనిక వేసి సదరు బిల్లును రైతుకు,

వ్యాపారికి అందచేస్తారు. బెల్లం తెచ్చిన రైతుకు తన కమీషన్, హమాలీ కూలీ మినహాయించుకుని బెల్లం ధరను చెల్లిస్తారు. బెల్లాన్ని కొనుగోలు చేసిన ఎగుమతిదారులు కూలీలతో బెల్లాన్ని గోనె సంచెలలో కుట్టి ఇతర రాష్ట్రాలకు తరలిస్తారు. మరి కొందరు వ్యాపారులు సరుకును గోడౌన్లలో పెట్టుకుని మంచి రేటు పలికేవరకూ చూసి అపుడు అమ్ముకుంటారు. దేశంలో మిగిలిన మార్కెట్లకు అనకాపల్లి మార్కెట్‌కు తేడా ఏమిటంటే బెల్లం తెచ్చిన రైతుకు ఇక్కడ వెంటనే డబ్బు చెల్లిస్తారు.

మిగిలిన మార్కెట్లలో ఎగుమతిదారు బెల్లం అమ్ముకున్నాక రైతుకు చెల్లిస్తారు. అయితే ఈ ఆన్‌లైన్ ట్రేడింగ్ వలన రైతుకు నష్టం సంభవిస్తుంది. మార్కెట్ యార్డుకు వచ్చిన బెల్లంకు కమిటీ వారు సెస్ విధిస్తారు. అసలే గిట్టుబాటు ధర లేదు. పైగా ఈ మార్కెట్ సెస్ భారం రైతుకు భారం అవుతుంది. ఈ కారణంగా రైతులు తమ ప్రాంతాలకు వచ్చిన షావుకార్లకు బెల్లం విక్రయిస్తున్నారు. షావుకార్లు సొంతంగా ఎగుమతులు చేసుకోవడం వలన మార్కెట్‌కు వచ్చే బెల్లం దిమ్మల సంఖ్య బాగా తగ్గుముఖం పడుతుంది. అలాగే చెరకు పండించే రైతు ఇతర పంటలవైపు మళ్లిపోవడం వలన బెల్లం తయారీ తగ్గుముఖం పడుతూ వస్తుంది.



### ఆర్గానిక్ బెల్లానికి పెరుగుతున్న డిమాండ్

పూర్తిగా సేంద్రియ ఎరువులతో పండించిన ఆర్గానిక్ బెల్లం కొనుగోలుకు ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ కారణంగా షాపులలో సైతం బెల్లం కొనుగోల్లు తగ్గుముఖం పట్టాయి. ఆర్గానిక్ బెల్లంలో ఎటువంటి రసాయనాలు వాడరు. కాకుంటే బెల్లం కాస్త నలుపు రంగులో ఉంటుంది. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్గానిక్ బెల్లం, బెల్లం పొడర్లను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. అనకాపల్లి, మాడుగుల, తిమ్మరాజుపేట వంటి ప్రాంతాలలో రైతులు కేవలం సేంద్రియ ఎరువులతో చెరకు పండించి బెల్లం తయారు చేస్తున్నారు. బెల్లం దిమ్మలను పొడర్లుగా మార్చే చిన్న చిన్న యూనిట్లను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. ఆర్గానిక్ బెల్లంతో తయారు చేసిన పొడర్‌కు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వారు పేటెంట్ కూడా పొందారు. దీనిపై 1994 నుంచి ప్రయోగాలు చేసారు. పోషక విలువలు కలిగిన మునగ ఆకు, అలివేరా, తేనె, శరీరానికి అవసరమైన మినరల్స్, విటమినులు ఈ బెల్లం పొడిలో ఉంటాయి. ఎక్కువ కాలం నిల్వ ఉండేలా, ఆరోగ్యకరంగా దీనిని తీర్చిదిద్దారు. ఈ అంశాలపై రీసెర్చి చేసినందుకు గానూ అనకాపల్లికి చెందిన ఆళ్ల అనూషకు ప్రధానమంత్రి మోడీ నుంచి అవార్డు కూడా పొందారు.

**- భీమరశెట్టి వెంకటేష్**
సీనియర్ జర్నలిస్టు

## దుబాయ్ చూసొద్దామా!

**15వ పేజీ తరువాయి**

దుబాయ్‌లో మంచినీటి కొరత ఉండటంతో సముద్రజలాలను శుద్ధి చేసి ఉపయోగిస్తున్నారు. దుబాయ్‌లో 80శాతం నీరు ఈ పరిజ్ఞానం ద్వారానే వస్తుంది. అంతేకాక కృత్రిమ మేఘాలను సృష్టించి విమాన సహాయంతో సిల్వర్ అయోడిడ్ కెమికల్‌ను మేఘాలపై చల్లి కృత్రిమంగా వర్షాలు కురిసేలా చేస్తూ తాగునీటి కొరతను అధిగమిస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా దుబాయ్‌లో ఎప్పుడు కావాలంటే అప్పుడు కృత్రిమ వర్షాలు కురిపిస్తుంటారు. ఇటీవల కనీవినీ ఎరుగని రీతిలో కురిసిన వర్షం కారణంగా దుబాయ్ వరదతాకిడికి గురైంది. దుబాయ్‌లో అనేక చారిత్రక కట్టడాలు ఉన్నాయి. వీటిలో 1200 ఒకేసారి నమాజ్ చేసుకునేలా నిర్మించిన జుమేరా మసీదు ముఖ్యమైనది. క్రీ.శ.1787లో అప్పటి పాలకుడైన షేక్ సయీద్ బిన్ మక్తూమ్ అల్ మక్తూమ్ హయాంలో నిర్మితమైన అల్ ఫాహిదీ కోట సందర్శించదగినది. దుబాయ్‌లో పరిచయం అవసరం లేని ప్రదేశం దుబాయ్ క్రీక్. ఇది దుబాయ్ నగరాన్ని రెండు విభాగాలుగా విభజిస్తుంది. క్రీక్ అనేది సహజ సముద్రపు నీరు. ఇది దుబాయ్ నగరమధ్యలో ఉంది. దుబాయ్‌లో చమురును కనుగొనడానికి ముందు స్థానిక జనాభా జీవనోపాధికి ఇది కేంద్రబిందువుగా విరాజిల్లింది. దుబాయ్‌లో సోక్స్‌ప్పాట్స్ పరిమళద్రవ్యాలు, మసాలా దినుసులు, బంగారం, వస్త్రాలు, తివాచీలు, అరుదైన ఆభరణాలు, రగ్గులు, వెండి సామాగ్రి ఇత్యాది వాటికి చాలా ప్రసిద్ధి చెందినది. దుబాయ్‌లో ప్రముఖ ఆకర్షణలలో బుర్జ్‌నహార్ ఒకటి. ఆ కాలంలో చొరబాటుదారుల నుండి నగరాన్ని రక్షించేందుకు ఇక్కడ ఒక వాచ్‌టవర్ కూడా నిర్మించారు దీన్ని దుబాయ్ వారసత్వ సంపదగా భావిస్తారు. ప్రపంచంలో అతిపెద్ద అక్వేరియం దుబాయ్‌లో ఉంది. ఇది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది. ఇందులో 33వేల కంటే ఎక్కువ జలచరాలకు నిలయంగా భాసిల్లుతుంది. 140 వైవిధ్యంతో కూడిన జాతులను ఇందులో చూడవచ్చు. షేక్ సయీద్ అల్ మక్తూమ్ మ్యూజియం అరబిక్ నిర్మాణశైలికి ప్రతీకగా కనిపిస్తుంది. ఇది చాలా పురాతనమైనది. సందర్శించదగినది. ప్రసిద్ధ వినోద కేంద్రంగా విరాజిలుతుంది అడవి వాడి. ఇక్కడ పాతికకు పైగా వినోదభరితమైన రైడ్లు ఉంటాయి. దుబాయ్ మెరీనాలో వేగంగా వెళ్లే మరపడవల్లో ప్రయాణించి వింత అనుభూతిని పొందవచ్చు. జుమేరా బీచ్‌ను తప్పక చూడదగినది. ఈ బీచ్‌లో వేలాదిమంది పర్యాటకులు సేదతీరుతుంటారు. దుబాయ్ హెరిటేజ్ గ్రామాన్ని సందర్శిస్తే అక్కడి పురాతన సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయి. దుబాయ్‌లోని సీతాకోకచిలుకల తోట కచ్చితంగా చూడదగిన ప్రదేశం. ఇక్కడ వేలాది రకాల సీతాకోక చిలుకలను చూడవచ్చు. దీన్ని సందర్శించడానికి ప్రపంచ పర్యాటకులు అనునిత్యం తరలి వస్తుంటారు. అల్-బస్తాకియా జిల్లాలో వస్త్రాలు, ముత్యాల వ్యాపారం జోరుగా సాగుతుంది. దీన్ని అల్-ఫాహిదీ హిస్టారికల్ నైబర్‌హుడ్ పేరుతో కూడా పిలుస్తారు.



### దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు

ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం దుబాయ్‌లో ఉంది. ఏడాదికి 26కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా దీన్ని పునర్నిర్మించారు. గతంలో ఉన్న ఎయిర్‌పోర్టు విస్తీర్ణంతో పోలిస్తే ఐదురెట్లు పెద్దదిగా దీన్ని రూపొందించారు. రూ.2.9లక్షల కోట్ల వ్యయంతో ఈ టెర్మినల్ ను తీర్చిదిద్దారు. నూతనంగా నిర్మించిన టెర్మినల్‌ను అల్ మక్తూమ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా పిలుస్తున్నారు.

కథ

**తంగిరాల చక్రవర్తి**

# మా నేల.. మా ఊరు

**అరవై గజాల ఇంటి జాగాకై ఇరవై జిల్లాల్లో పేదలు.. ప్రభుత్వాధికార్లతో పోలీసుల్తో, రాజకీయ నేతల పెంపుడు గుండాలతో ఒకే సమయంలో హోరా హోరీగా కలబడి నిలబడి పోరాటం చేస్తున్న టి.వి. దృశ్యాన్ని నెహ్రూ బస్ స్టేషన్‌లో చూస్తున్నారు సలీం, శ్యామ్, శర్మలు.**

"మనం వెళ్లేది ఈ వూరేనే" అన్నాడు సలీం.

"అవును" అన్నారు శ్యామ్, శర్మలు.

ఎప్పుడో స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వాడిపై పన్నులు నిరాకరిస్తూ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గ్రామాల్ని ఖాళీ చేయించి వేరే ప్రాంతంలో ఇళ్లు నిర్మింపజేసి, ఉద్యమించి, అన్ని రకాల పన్నుల్ని చెల్లించకుండా గ్రామ గ్రామాల్ని కదిలించాడట ఉప్పు సత్యాగ్రహంలో" అన్నాడు శర్మ... అదీ పరాయి వాడి పాలనలో. ఇప్పుడు మన స్వేచ్ఛా స్వరాజ్యంలో ప్రజలే ప్రభువులుగా వుండే ప్రజాస్వామ్య పాలనలో మన పాలకుల దౌర్జన్యం ఎలా చూడాలి?" అన్నాడు శ్యామ్.

ముగ్గురు మాట్లాడుకొంటున్న తరుణంలో వాళ్లు వెళ్లాల్సిన ఊరి బస్సు వచ్చింది 12వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై. గబగబా బస్సెక్కి సీట్లలో కూర్చొని క్షణాల్లో నిద్రలోకి జారుకొన్నారు ముగ్గురు. రాత్రి షిఫ్ట్‌లో పని చేయడంలో అలసిన దేహాల్ని నిద్ర తన స్వాధీనంలోకి తీసుకోవాలి.



............

ఓ పట్నంబాబులూ నిద్ర లేండి... మీ స్టాప్ వచ్చింది అంటూ కండక్టర్ బస్ ఆపి పెద్దగా అరుస్తున్నాడు.

శర్మా, సలీం లేవండిరా! అంటూ బ్యాగ్స్ తీసుకొని గబగబా బస్సు దిగారు.

గూగుల్ మ్యాప్‌లో లొద్దిపల్లి స్మార్ట్ ఫోనులో సెర్చి చేస్తూ డొంకరోడ్డు వెంబడి నడకను సాగించారు శ్యామ్, శర్మ, సలీంలు.

బురదనీటిలో మహిళా వ్యవసాయ కూలీల తల్లులు నడుం వంచి జానపద గీతాలు ఆలపిస్తూ నాట్లు వేస్తున్నారు. తాడిచెట్లపై కల్లును గీస్తున్నారు గీత కార్మిక సోదరులు.

దూరంగా దేవాలయం మైక్‌లో అంబా శాంభవి అంటూ దుర్గాదేవిపై పాట మంద్రంగా వినిపిస్తోంది. మరోవైపు నుండి అల్లా హో అక్బర్... అంటూ మసీదులో మధ్యాహ్నం నమాజ్ ఏక కంఠంతో వినిపిస్తోంది.

తన్ను తాను తగ్గించుకొన్నవాడు హెచ్చింపబడును.. ప్రభువు ఏసును.. ఆయన రాకను నమ్ముడి' అంటూ పాస్టర్ ఉపన్యాసం చర్చిలోని మైక్ ద్వారా వినిపిస్తోంది.

చర్చి బెల్స్ మోగుతున్నాయి.. వారు చేరాల్సిన గమ్యస్థానం ఒక అర మైలులోపే వుంది అంటే రామ్ కెమికల్స్ కంపెనీ ముందు ఎర్ర జెండాలు చేబూని కనీస వేతనాలు, ఉద్యోగాల పర్మినెంట్ కోసం ఖాకీ దుస్తుల్లో కార్మికులు నినాదాలు చేస్తున్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ సైన్యం, స్థానిక పోలీసులు ఫ్యాక్టరీ గేటు ముందు నిలబడ్డారు. కార్మిక నేత ఆవేశ ప్రసంగాన్ని శర్మ తన సెల్‌లో షూట్ చేస్తున్నారు. భుజానికి తగిలించుకొన్న బ్యాగ్‌లోంచి డైరీ తీసి 1,2 మంది కార్మికులతో ఏవో ప్రశ్నలు వేస్తూ నోట్స్ రాసుకొంటున్నాడు సలీం.

ఫ్యాక్టరీ సెక్యూరిటీ రిసెప్షన్ రూం కిటికి వద్దకు వెళ్లి సెక్యూరిటీ ఆఫీసర్‌కు ప్రశ్నలు సంధిస్తున్నాడు శ్యామ్ తన జర్నలిస్ట్ ఐ.డి.కార్డు చూపుతూ.

యాజమాన్య సంక్షేమ సంఘం ఆఫీసర్లు గో బ్యాక్... అంటూ తెల్ల అంబాసిడర్ కార్లలో అక్కడికి చేరిన కార్మిక అధికార్లపై విరుచుకుపడ్డారు కార్మికులు.. గో బ్యాక్ అంటూ నినదిస్తున్నారు.

ఏదో బెంగాలీ డాక్యుమెంటరీ చిత్రంలా వుంది రోడ్డుకు రెండు గజాల పల్లంలో టార్పాలిన్, తాటాకు, తడికెలు, ప్లాస్టిక్ కవర్లు, ఫ్లెక్సీలతో వేసుకొన్న గుడిసెల్ని జెసిబితో జులుం చేస్తూ వారి అన్నాన్ని నేలపాలు చేస్తూ చెంబు, గిన్నెల్ని బైటికి విసురుతున్నారు.

పిల్లల ఏడుపులతో, పోలీసుల లాఠీలతో సాగించే భయంకర విన్యాసాల్ని చూసారు సలీం, శర్మ.

"రేయ్ శ్యామ్, నీ కెమెరా బైటికి తీయి" అన్నారు ఇద్దరూ.

అక్కడ గుడిసెల్లో వున్న వారిని బలవంతంగా లారీల్లోకి ఎక్కించే పోలీసుల జులుంపై గొంతెత్తి వారు 'జులుం నశించాలి" అని నినదిస్తున్నారు.

ఆ దుర్మార్గాన్ని అడ్డుకొంటున్న కాపలాదారు డప్పు కనకయ్య ఏసును వదలి, మిగతా వారిని ఎక్కడికో పునరావాస ప్రాంతానికి బలవంతంగా తరలించారు.

"బాబూ.. తమరు?" అని ప్రశ్నించాడు కనకయ్య.

"మేం జర్నలిస్టులం, పట్నం నుండి వచ్చాం" అన్నారు శ్యామ్, సలీం, శర్మలు.

"ఆళ్లు పేపరోళ్లు. ఆళ్ల పేరు సెబితేనే ఎమ్ఆర్ఓ, డిప్యూటీ తాసీల్దార్ వణికిపోయారు లక్ష్మమ్మా" అన్నాడు డప్పు కనకయ్య. "ఎమ్.ఎల్.ఏ, ఎమ్.పిలే మనకు వ్యతిరేకంగా వుంటే వీళ్లెంత?" అన్నాడు వడ్రంగి వీరాచారి.

"బాబూ ఇక్కడి నుండి వెళ్లిపోండి. మీపై కూడా బైండోవర్ కేసులు పెడతారు. ఎమ్.ఎల్.ఎ.నరేందర్ మనుషులు మిమ్మల్ని చంపేసినా చంపేస్తారు" అన్నాడు ఏసుబాబు.

"మీ ఇద్దర్ని ఎందుకు వదిలేసారు?" అన్నాడు సలీం ఆశ్చర్యంగా.

"నేను సర్కార్‌వారి విషయాలు.. చాటింపు వేస్తాను. మా ఏసుబాబు ఈ పొలం జాగాలకు కాపలాదారు. అందుకే మా జోలికి రాలేదు".

"మీరు ఇద్దరూ ఎమ్ఆర్ఓ ఆఫీసుకు వెళ్లి- ఢిల్లీ నుండి విలేకర్లు వచ్చారు. భూపోరాటం చేసేవారిని ఇంటర్వ్యూలు చేస్తూ ఫొటోలు తీస్తున్నారు. మిమ్మల్ని రమ్మంటున్నారని చెప్పండి" అన్నాడు శాస్త్రి తన విజిటింగ్ కనకయ్యకు అందిస్తూ.

"ఆళ్లు ఎవరికీ భయపడరు బాబు" అన్నాడు యేసు. ఢిల్లీ ఇంగ్లీషు పత్రికలకు భయపడతారు. మీరు వెళ్లి ఎమ్ఆర్ఓకు చెప్పండి" అన్నాడు సలీం.

గుడిసెలో మూలుగు వినిపించడంతో ఆందోళనగా ముగ్గురూ ఆ గుడిసె దగ్గరకు వెళ్లారు.

చినిగిన బట్టలతో... రక్తం మడుగులో నలభై యేండ్ల స్త్రీ రోదిస్తోంది. ముగ్గురికి ఆమె స్థితి అర్థమైంది. ఆమెకు ఫస్ట్ ఎయిడ్ చేసి నీళ్లు తాగించారు. వారి వద్ద వున్న ఆహార పొట్లాలు ఇచ్చి తినిపించారు. "తాము వున్నాం" అనే భరోసా ఇచ్చారు సలీం, శర్మ, శ్యామ్‌లు.

"బాబూ, నా పేరు లక్ష్మమ్మ. నా భర్త వెంకటాలు. ఫ్యాక్టరీలో ఫోర్‌మాన్‌గా పని చేస్తున్నాడు. నా కొడుకుకు చదువు లేకపోవడంతో బాబుగారి పొలంలో పాలేరుగా వున్నాడు. మా పక్క గుడిసెలో హసీనా-సుభానీ దంపతులు. ఆ ఎదురుగా సిమెంట్ రేకుల్తో వున్న చిన్న ఇంట్లో మేరీ టీచర్ ఆమె భర్త లాజరస్ వున్నారు. ఇంకా కుమ్మరి రంగయ్య, కమ్మరి భూషయ్య, జాలరి ఉప్పెనయ్య, వడ్రంగి వీరాచారి, రజక ఈశ్వరమ్మ, బార్బర్ వెంకటయ్యలు వుంటున్నాం. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ గుడిసెలు వేసుకొని జీవిస్తున్నాం. ఇంకా ఇల్లు లేని పేదలు 1600 మంది టార్పాలిన్ ఫ్లెక్సీల్తో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. సర్కార్‌వాళ్ల కూల్చడం, మళ్లీ గుడిసెలు వేసుకోవడం, ఎండలో, వర్షాల్లో నానా బాధలు పడుతున్నాం. మా వూళ్లో మేమే ఎలా పరాయివాళ్లం అయ్యాం?" అంది అంత నిస్సత్తువలో కూడా లక్ష్మమ్మ.

సూర్యాస్తమయం కావడం, పొలాల నుండి ఫ్యాక్టరీల నుండి పని ముగించుకొని నేలకూలిన తమ గుడిసెల్ని అత్యంత క్రోధంతో తమ చేతుల్లోని పనిముట్లతో క్షణాల్లో కూలిన గుడిసెల్లో నిలబెట్టి మా ప్రాణాలు పోయినా 'ఈ నేల విడువం' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా శపథం చేస్తూ నినాదాలు చేసారు.

ప్రకృతి వీరి పట్టుదలకు హర్షించిందా అన్నట్లుగా వర్షం ఆరంభమైంది. లోతట్టు ప్రాంతం కావడంతో గుడిసెల్లోకి నీరు చేరింది. పాములు, తేళ్లు, జెర్రెలు రాసాగాయి. చిమ్మచీకట్లను వున్న ఫ్యాక్టరీల్లోని కాంతి ఆ గుడిసెలపై మినుకు మినుకుమంటూ పడుతోంది.

మనుషులకన్నా తాము ప్రమాదకారకులం కాము... అంటూ విష జంతువులు సైతం గుడిసెల్లోకి చేరినా ఓ మూల నక్కి వున్నాయి.

కొందరు సమీపంలోని పాత కమ్యూనిటీ హాలు వైపుకు, కొందరు పాడుబడ్డ ఆ శివాలయంలోకి చేరి తల దాచుకున్నారు. సగం కూలిన లాజరస్ షెడ్డు ఇంట్లోకి చేరారు శర్మ, సలీం, శాస్త్రిలు.

............

"పట్నంబాబులు.. ఇక్కడ మీరు ఉండలేరు బాబు. ఎప్పుడు గుండాలు విరుచుకుపడతారో, ఎప్పుడు రెవెన్యూ ఆఫీసర్లు వచ్చి ఈ భూములు స్వాధీనం కోసం గుడిసెలు కూల్చుతారో, ఎప్పుడు లాఠీచార్జీ చేసి అరెస్టు చేస్తారో... తెలియని భయంకర పరిస్థితుల్లో వుంటున్నాం" అంది లక్ష్మమ్మ శర్మ, సలీం, శాస్త్రిలతో.

"ఆళ్లు పేపరోళ్లు. ఆళ్ల పేరు సెబితేనే ఎమ్ఆర్ఓ, డిప్యూటీ తాసీల్దార్ వణికిపోయారు లక్ష్మమ్మా" అన్నాడు డప్పు కనకయ్య.

"ఎమ్.ఎల్.ఏ, ఎమ్.పిలే మనకు వ్యతిరేకంగా వుంటే వీళ్లెంత?" అన్నాడు వడ్రంగి వీరాచారి.

దొరల ఫ్యాక్టరీల కోసం ప్రాజెక్టుల కోసం, రింగ్ రోడ్ల కోసం, కెమికల్ ఫ్యాక్టరీల కోసం, మానేరు భూములు గుంజుకొన్నారు. రైతును రోజుకూలీ చేసారు. చదువులు లేక, కొలువులు రాక మా పెద్దలకు భారం అయ్యాం" అన్నారు కొందరు యువకులు.

వీరు మాట్లాడుతుండగానే పట్నం నుండి పెద్ద వ్యానులో సామాజిక కార్యకర్తలు గుడిసెల వాసులకు సంఘీభావంగా నిలబడేందుకు వచ్చారు.

తమతో పాటు గుడిసెల్లో నివసించే వర్షం నీటిలోనే జీవిస్తూ బోనం ఎత్తి వేపచెట్టు కింద పోశమ్మకు బోనం ఎత్తారు మహిళలు. పీర్ల పండుగ కూడా రావడంతో ముస్లింలు, పీర్లను వారు చేసిన ఖీర్ ప్రసాదాన్ని తెచ్చారు. కొందరు యువకులు పోతరాజు వేషాల్తో నాయకులకు ఎదురొచ్చి స్వాగతం పలికారు. ఇదో అపూర్వ సంఘటనగా అనిపించింది శ్యామ్, సలీంలకు. కులాల్ని, మతాల్ని, ప్రాంతాల్ని ఆవలకు తోసి పేదలంతా "ఈ నేల మాది.. గుడిసెలకు పట్టాలివ్వాలి" అంటూ రణ నినాదాల్ని ముందు వరసలో నడిచే కుమ్మరి రంగయ్య, కమ్మరి భూషణం, జాలరి జానయ్య, ఉప్పెనయ్యలు ఇవ్వసాగారు.

పట్నం నుంచి వచ్చిన నాగయ్య, వీరయ్య, రాములుగార్లు మీడియా తరపున వచ్చిన శర్మ, సలాం, శ్యామ్‌లు పరిచయం చేసుకొన్నారు. గుడిసెల వాసులకు భరోసా ఇస్తూ ప్రసంగిస్తున్న తరుణంలో పోలీసులు ఎమ్ ఆర్ఓ, కలెక్టర్లు అక్కడికి వచ్చారు.

ఈ నేలను మల్టీ నేషనల్ కంపెనీ లీజుకు తీసుకొంది. మీరు ఇక్కడి నుండి వెళ్లిపోవాల్సిందే..... ఎప్పటికైనా" అంటూ హ్యాండ్ మైక్ చేతబుచ్చుకొని హెచ్చరిస్తున్నాడు రవిచంద్ర.

“ఎక్కడో జక్కలొద్దిలో ప్రారంభమైన గుడిసెవాసుల ఇంటి జాగాకై సాగించిన ఉద్యమం వంద పోరాట కేంద్రాల్లో ఇరవై జిల్లాల్లో సాగుతోంది. జనాభిప్రాయం మీరు ఆమోదించాలి” అన్నాడు వీరయ్య.

“డంపింగ్ యార్డుల్లో మురికివాడల్లో లక్షలాది మంది నివసించే దుస్థితి మీకు కనపడదా?” అన్నాడు రాములు.



“లక్షల మంది పేదలు గుడిసెలు వేసుకొని ఉన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించాలి” అన్నాడు నాగయ్య.

“ఇంటి సౌకర్యం జీవించే హక్కులో భాగం” అంటూ ఢిల్లీ హైకోర్టు తీర్పును గుర్తు చేసాడు రాములు.

“గౌరవప్రదంగా ఇంటి సౌకర్యంతో జీవించే హక్కు పేదలకు ఉంది” అన్నారు శ్యామ్, సలీం, శాస్త్రీలు.

స్పిన్నింగ్ ఫార్మా, కన్‌స్ట్రక్షన్, పౌల్ట్రీ, డిస్టిలరీస్, ఆటోమొబైల్స్, షాపు ఉద్యోగులు, వలసకూలీలు “ఇది మా నేల” అని నినదించారు.

1988 కేంద్రం అగ్ని ప్రమాదాల్లో గుడిసెలు కాలిపోతే నష్టపరిహారం ఇవ్వాలని చెప్పింది. ఎమ్ఆర్ఓ, కలెక్టర్ పి.యస్‌లలో రిపోర్టులు ఇచ్చినా ఈ గుడిసెవాసులకు ఎందుకు పరిహారం ఇవ్వలేదు?” అన్నాడు అధికార్లను తీవ్రంగా ప్రశ్నించే ధోరణిలో శాస్త్రి.

నాలుగు సంవత్సరాలు ఒక ప్రాంతంలో నివసించే వారిని తొలగించరాదు అని కోర్టులే చెప్పాయి. మరి మీ అధికార గణం ఈ గుడిసె వాసులపై సాగించే అరాచకం ఏమిటి?” అన్నారు సలీమ్.

“ఈ గుడిసెల్లో నివసించే ఆడపడుచులపై దాడులు, లైంగిక దాడులు చేస్తే, బాధితులు ఎఫ్ఐఆర్, పిఎమ్ఇ నివేదికలు ఇచ్చి న్యాయం కోరినా, హెల్త్ సర్టిఫికెట్లు ఇచ్చినా ఎమ్ఆర్ఓ ఎందుకు సాయం చేయలేదు” అంది లక్ష్మమ్మ. ఎమ్ఎల్ఏ అనుచరుల దాడులు ఆపాలి అంది మేరీ టీచర్.

పోరంబోకు, శిఖం భూములు, బంజర్లు నిరుపేదలకు ఎందుకు పంచలేదు?” అని అధికార్లను మీడియావారి సమక్షంలో అధికార్లను ప్రశ్నించారు పేదలంతా.

“ఒక్క మన రాష్ట్రంలోనే 30 లక్షల మందికి ఇళ్లు లేవు. ఏ భూమి అయితే సర్కార్‌దో ఆ భూమి బహుజన శ్రామిక పేదలదే” అన్నాడు శాస్త్రి.

58 జి.ఓ. ప్రకారం ప్రతి గుడిసెకు పట్టాలు ఇవ్వాలి. మురికివాడల్లో నివాసముండే వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించాలి. 13 లక్షల పట్టాల దరఖాస్తులు ఏమైనాయి?” అన్నాడు కలెక్టర్‌తో నాయకుని హోదాలో ప్రశ్నిస్తూ వీరయ్య.

“బాంబే ఆవాస్, ఇందిరా ఆవాస్, ప్రధాని ఆవాస్ యోజన పథకాల కింద ఎన్ని ఇళ్లు, ఎన్ని పట్టాలు ఎంత మందికి 3 లక్షల నగదు ఇచ్చారు?” అని ప్రశ్నించాడు శ్యామ్.

“దళితులకిచ్చి వాగ్దానాలు ఏమైనాయి?” అంది లక్ష్మమ్మ.

ఆరు లక్షల ఖాళీ భూములు పంచేదాకా ఈ పోరాటం ఆపం అన్నారు నాగయ్య, వీరయ్యలు.

జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఈ పోరు వార్తలు పంపారు శ్యామ్, సలీం, శాస్త్రీలు.

సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యాల పత్రికా వార్తా క్లిప్పింగ్‌లతో వేశారు. నేల కోసం ప్రాణాలు తెగించి పోరు సాగించే గుడిసెలపై నీలి, ఎర్ర జెండాలు కనిపించాయి. ఉద్యమం సాగుతోంది.




## ఊళ్లో లేను

అనిల్: ఏరా నానీ! నువ్వు గీత గీస్తే మీ ఆవిడ దాటదు.. అన్నావు. నిన్న మీ ఆవిడ ప్రదీప్‌తో సినిమాకి వెళ్లడం చూసాను.

నాని: ఓ అదా.. నేను రెండు రోజులు ఊళ్లో లేనులే.

## ఒప్పుకుందిగా..

నాని: నానీ, నువ్వు ఏం చెప్పినా మీ ఆవిడ వింటుంది అన్నావు. నిన్న మాటలు ఉతకమనడం విన్నాను.

అనిల్: అప్పుడు నేను రేపు వెతుకుతాను డార్లింగ్ అన్నాను. సరే అనిందిగా.

## ఆవిరితో సరి..

డాక్టర్: లిఖితగారూ, మీ శరీరంలో కొలెస్ట్రాల్ చాలా ఉంది. శరీరం చెమట పట్టే విధంగా చేయండి.

లిఖిత: అలాగే డాక్టర్! ఆవిరి పడితే సరిపోతుందిగా.

## మా ఆవిడా అంతే..!

విజ్జి: నానీ, నిన్ను నమ్ముకుని కట్టుబట్టలతో వచ్చేసాను.

నాని: మా ఆవిడ కూడా అలాగే చెప్పింది మరి.

## అడ్రస్

లెక్చరర్: ఈరోజు మీకు లాస్ట్ క్లాస్. పరీక్ష పేపర్ ప్రెస్‌కి ఇచ్చేసారు. మీకు ఇంకా డౌట్స్ ఏమైనా వుంటే అడగండి.

ధనుష్: ఒక డౌట్ టీచర్... ఆ ప్రెస్ ఎక్కడో చెప్తారా?

## పక్కింటివారితో..

విజ్జి: ఏమండీ! ఆదివారం సినిమాకి వెళ్దామా?

నాగు: ఫ్యామిలీతో వెళ్లే సినిమాలు ఏమీ లేవే.

విజ్జి: అలాగా! అయితే పక్కింటి నానితో సినిమాకి వెళ్తానండి.



## వద్దు..

నివాన్: మమ్మీ, నేను నా ఇష్టం వచ్చినట్లు వుండాలంటే నేను ఎంత పెద్ద అవ్వాలి?

రాధ: మీ డాడీ ఇష్టానికి వెళ్లే ఇప్పటికీ అంత పెద్ద అవ్వలేదు.

## తెలియదండీ!

డాక్టర్: మేడం! అయిదు నిమిషాలు ఆలస్యమైతే మీ అత్తగారి ప్రాణాలు పోయేవి.

రజని: అయ్యో డాక్టర్! ఆ విషయం నాకు తెలియలేదు.

**- ఈ.ఎస్.మాధవన్**

# తెలుగు భాష పరిణామ వికాసం

డా॥ టి. గౌరీశంకర్




## ప్రస్తావన

బహు భాషా సంస్కృతుల సమ్మేళం మన భారతదేశం. ప్రతి భాషకు తనదైన ఒక ప్రత్యేకత ఉంది. ఒక జాతి అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడేవి ఆ జాతి భాషా సంస్కృతులు. అందువల్ల వాటిని పరిరక్షించుకోవడం ఆ జాతి బాధ్యత. ఆ రకంగా సుమారు మూడు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు జాతికి రెండు వేల సంవత్సరాల పైచిలుకు చరిత్ర కలిగిన తెలుగు భాష ఉంది, వెయ్యేళ్ల పైబడిన తెలుగు సాహిత్యం ఉంది.

## ప్రాచీనత

సుమారు అయిదు వేల సంవత్సరాల క్రితమే మూలద్రావిడ భాష నుంచి విడివడిన తెలుగు క్రీ.శ.5,6 శతాబ్దాల నాటికే ఒక ప్రత్యేక భాషగా ఏర్పడిందంటారు. ఆనాటి నుంచి క్రీ.శ.1700 వరకు తెలుగు నేలను పరిపాలించిన వివిధ రాజవంశాల ఏలుబడిలో సంస్కృతం, ప్రాకృతం, అరబ్బీ, పర్షియన్ భాషలు ఉన్నప్పటికీ తెలుగు కూడా రాజభాషగా లేదా అధికార భాషగా కొనసాగినట్లు భాషా చరిత్ర పరిశోధకులు పేర్కొంటారు.




## ఆనాటి రాజభాషలు

క్రీ.శ.500-800 ప్రాంతంలో పశ్చిమ ఆంధ్ర ప్రాంతాన్ని వేంగీ చాళుక్యులు పాలించినప్పుడు తెలుగు, కన్నడం, సంస్కృతం అధికార భాషలుగా ఉండేవి. క్రీ.శ.1000-1200 మధ్య కాలంలో రేనాటి చోళులు తీర ప్రాంతాన్ని పాలించినప్పుడు, తెలుగు, సంస్కృతం రాజభాషలుగా ఉండేవి. క్రీ.శ.1100 నుంచి 1300 దాకా కాకతీయులు తెలంగాణతో సహా సమగ్ర కోస్తా ప్రాంతాన్ని పాలించినప్పుడు తెలుగే అధికార భాష. వెలనాటి చోళులు కృష్ణా, గుంటూరు జిల్లాలు పాలించినప్పుడు తెలుగు ప్రధాన భాషగా, సంస్కృతం క్వాచిత్కంగా కొనసాగింది. క్రీ.శ. 1330-1458లో రేచర్ల వెలమలు తెలంగాణ ప్రాంతాన్ని పాలించినప్పుడు తెలుగు అధికార భాషగా ఉండేది.

## ఆధునిక కాలం-తెలుగు

ఆంగ్లేయుల రాకతో మన దేశంలోకి ఇంగ్లీషు భాష ప్రవేశించినప్పటికీ తెలుగు ప్రాంతాలలో అధికార భాషగా ఇంగ్లీషుతో పాటు తెలుగు, ఉర్దూ భాషలు కూడా మనగలిగాయి. కానీ తెలంగాణ ప్రాంతం నిజాం ఏలుబడిలో ఉర్దూ రాజభాషగా మనుగడ సాగించింది. క్రీ.శ.1520లో సర్‌థామస్ మన్రే మద్రాసు గవర్నర్‌గా ఉన్న కాలంలో కంపెనీ ఉద్యోగులు ప్రజల భాషలో పరిపాలన కొనసాగించాలన్నాడు. 1885లో లార్డ్ మెకాలే భారతదేశంలోని విద్యాలయాలలో బోధనా భాషగా ఇంగ్లీషుని ప్రవేశపెట్టినప్పుడు ఫ్రెడరిక్ జాన్‌డోర్, లార్డ్ డ్రెమండ్, లార్డ్ విల్సన్ వంటి ఆంగ్లేయ మేధావులు బోధనా భాషలుగా దేశీయ భాషలు, మాతృభాషలే ఉండాలని ఆనాటి పార్లమెంట్‌లో వాదించారు.

## గ్రాంథిక-వ్యావహారిక భాషలు

ఒక భాష మనుగడ కొనసాగాలంటే, ఆ భాష బోధనా భాషగా, పాలనా భాషగా, పత్రికా భాషగా స్థిరపడాలి. అయితే ఏ భాషలోనైనా భాషా స్వరూపం ఒకే విధంగా ఉండదు. కాలానుగుణంగా మారుతూ వస్తుంది. ఇందుకు అనేక రాజకీయ, సామాజిక, సాహిత్య, ఆర్థిక రంగాలు కారణమవుతాయి. ఆ రకంగా తెలుగు భాష పరిస్థితిని గమనించినట్లయితే, క్రీ.శ.11వ శతాబ్ది నాటి నన్నయ నుండి 17వ శతాబ్ది కందుకూరి వీరేశలింగం వరకు గ్రాంథిక భాషే సాహిత్యంలో కొనసాగుతూ వచ్చింది. క్రీ.శ.1900 నాటికి తెలుగు భాష వినియోగం వివిధ రంగాలలో బాగా విస్తరించింది.

## వ్యావహారిక భాషోద్యమం

కావ్య భాషకు భిన్నమైనదంతా గ్రామ్యమని పండితులన్నారు. శిష్టులు కానీ పామరులు మాట్లాడే భాష, నియమ నిబంధనలు లేని భాష గ్రామ్యమని వారి ఉద్దేశం. అయితే కందుకూరి వీరేశలింగం పంతులు రచనాశైలి సరళంగా ఉండాలని అంటూనే అటు కావ్య భాషకు, ఇటు వ్యావహారిక భాషకు మధ్య రకంగా 'సరళ గ్రాంథిక' అనే ఒరవడిని తీసుకొని వచ్చారు. సాహిత్య, వైజ్ఞానిక విషయాలు ఎక్కువ మందిలోకి వెళ్లాలి అంటే అవి వారికి అర్థమయ్యే భాషలో ఉండాలనే వాదం ఒకటి బయలుదేరింది. దీనినే 'వ్యావహారిక భాష' అన్నారు. మళ్లీ దీనిలో 'శిష్ట వ్యావహారికం' అనీ, 'వ్యావహారికం' అనే రెండు పాయలు ఏర్పడ్డాయి. ఈ వ్యావహారిక భాషోద్యమాన్ని గిడుగు వెంకటరామమూర్తి పంతులు, గురజాడ అప్పారావు పంతులు ముందుకు తీసుకొని వెళ్లారు. అనువాదాలు, అనుసరణలు కాకుండా స్వతంత్ర పరిశోధనల ద్వారా తెలుగులో స్వతంత్ర గ్రంథాలు రావాలనీ, అప్పుడే తెలుగుజాతి వైజ్ఞానికంగా పురోగమిస్తుందనీ, తెలుగుభాష అభివృద్ధి చెందుతుందని వీరు భావించారు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం గ్రాంథిక భాషావాదులకు అనుకూలమైన విధానాలను అవలంభించింది. విశ్వవిద్యాలయాలలో, ఇతర విద్యాలయాలలో గ్రాంథిక భాషకు స్థానం దక్కినా, పత్రికలు, సాహిత్యం, ఇతర సృజనాత్మక కళారంగాలలో క్రమంగా వ్యావహారిక భాష స్థిరపడింది.

విద్యావకాశాలు మునుపటిలాగా ఏ కొందరికో పరిమితం కావు. విద్య అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక శాస్త్రీయ విషయ బోధనకు కావ్యభాష పనికి రాదు. ఆధునిక విద్యాబోధనా పద్ధతులలోని పఠన, పాఠనాదులలో బోధనా మాధ్యమంగా శిష్ట వ్యావహారికమే ఉండాలి ఆధునిక వచన రచనలు మాత్రమే పాఠ్యగ్రంథాలుగా ఉండాలని గిడుగు, గురజాడలు ప్రతిపాదించారు.

అర్ధగ్రాంథికం, కృత్రిమ వ్యావహారికంలో ఉన్న సెట్టి లక్ష్మీనరసింహం 'గ్రీక్పురాణ కథ' ఆనాటి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ ఫైనల్ పరీక్షకు ఉపవాచకంగా ఉండేది. ఏట్స్ అనే ఆనాటి స్కూళ్ల ఇన్‌స్పెక్టర్ విశాఖపట్నంలోని కాలేజీకి వెళ్లి తెలుగు పండితుని క్లాస్ విని- అతను బోధించే తెలుగుకు, బయట వ్యవహారంలో ఉన్న తెలుగుకు చాలా భేదం ఉండడం గమనించాడు. "ఎన్నడూ వాడని భాషను వారికెందుకు నేర్పుతున్నారో అర్థంకాలేదు, వాళ్లకు అర్థమయ్యే ఆధునిక వ్యవహారం పనికిరాదా?" అని ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.వి. శ్రీనివాస్ అయ్యంగార్‌ని ప్రశ్నించాడు.

అందుకు ఆయన పర్లాకిమిడి కళాశాలలో పనిచేస్తున్న గిడుగు రామమూర్తిని విజయనగరం సంస్థానంలో పనిచేస్తున్న గురజాడ అప్పారావును సంప్రదించమని చెప్పాడట. ఈ నలుగురి కలయికతో వ్యావహారిక భాషోద్యమం ప్రారంభమైంది. తన వాదాన్ని బలపరచుకోవడంలో భాగంగా గిడుగు 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజం', 'బాలకవి శరణ్యం' వంటి గ్రంథాలు రచించాడు. వ్యావహారిక భాషలో పాఠ్యగ్రంథాలు కూడా రచించాడు. ఈ లక్ష్యంతో ఏర్పడిన 'ఆంధ్ర సారస్వత సంఘా'నికి అధ్యక్షునిగా పనిచేశాడు. గ్రాంథిక భాషావాదులను ఖండిస్తూ 'ఆంధ్ర భాషా చరిత్ర' అనే అంశంపై 'ఆంధ్ర సాహిత్య పరిషత్' వార్షిక సభలో వ్యాసం సమర్పించాడు.

1919లో గిడుగువారు 'తెలుగు' అనే పత్రికను స్థాపించి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేశారు. దానితో క్రమంగా వ్యావహారిక భాష వాడకం విస్తృతమైంది. 1936లో 'నవ్య సాహితీ పరిషత్తు' అనే సంస్థ 'ప్రతిభ' అనే సాహిత్య పత్రికను ప్రారంభించింది. 1937లో తాపి ధర్మారావు వ్యావహారిక భాషకు మూలంగా 'జనవాణి' పత్రికను స్థాపించారు.

1965 నుండి పాఠ్య పుస్తకాల భాషా శైలి విషయంలో వాదోపవాదాలు తలెత్తాయి. సరళ గ్రాంథికంలో ఉంటున్న పాఠ్యపుస్తకాలలో మార్పు అనివార్యమయింది. 1956లో భాషా ప్రాతిపదికపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలుగు మాతృభాషంగా కలవారు, తెలుగు మాతృభాష కానివారు అని ఇక్కడి ప్రజలలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. వీరంతా ఇబ్బంది లేకుండా తెలుగు నేర్చుకోవాలంటే నిత్య వ్యావహారిక భాషలో పాఠ్య పుస్తకాలు ఉండాలని ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి వాదించారు.

ప్రభుత్వం పండితులతో కవులు, రచయితలు, విద్వాంసులతో తిరుపతిలో పింగళి లక్ష్మీకాంతంగారి అధ్యక్షతన ఒక సభను నిర్వహించింది. ఆ సభలో మొదటి భాషగా తెలుగు నేర్చుకొనే వారికి వాచకాల్లో సరళ గ్రాంథికం ఉండాలనీ, రెండో భాషగా తెలుగు నేర్చుకొనే వారికి శిష్ట వ్యావహారికం ఉండాలని తీర్మానించారు. 1960 నాటికి ఇవి ఆచరణలోకి వచ్చాయి. 1966లో తెలుగును అధికార భాషగా గుర్తిస్తూ చట్టం వచ్చింది. దీనిలోని సూచనలను పాటిస్తూ, ప్రభుత్వం 1969 ఆగస్టు 6న 'తెలుగు అకాడమీ'ని స్థాపించింది. తెలుగు మాధ్యమంగా ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల విషయంలో మళ్లీ వివాదం తలెత్తగా శిష్ట వ్యావహారికాన్ని అంగీకరించింది.

**గిడుగు 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజం', 'బాలకవి శరణ్యం' వంటి గ్రంథాలు రచించాడు. వ్యావహారిక భాషలో పాఠ్యగ్రంథాలు కూడా రచించాడు. ఈ లక్ష్యంతో ఏర్పడిన 'ఆంధ్ర సారస్వత సంఘా'నికి అధ్యక్షునిగా పనిచేశాడు.**

## బోధనా భాషగా తెలుగు

వాస్తవానికి ఆంగ్లేయుల కాలంలో ప్రాథమిక విద్య అంటే ఒకటి నుండి అయిదు తరగతి వరకు మాతృభాషలోనే విద్యాభ్యాసం కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం చాలా వరకు మాతృభాషా మాధ్యమంలోకి వచ్చాం అనుకొంటున్న తరుణంలో మళ్లీ ఆంగ్ల మాధ్యమంలోకి కూరుకొనిపోయాయి. 1964-66లో కొఠారి విద్యా కమీషన్ రాజ్యాంగంలోని అధికరణం-350ఎ ప్రకారం బాలల మేధో వికాసానికి పాఠశాల స్థాయి నుంచే మాతృభాషలో విద్యాబోధన జరగాలని సూచించింది. 2010లో భారత ప్రభుత్వం తెచ్చిన విద్యాహక్కు చట్టం 29(2)లో ప్రాథమిక స్థాయిలోనే మాతృభాషా బోధన జరగాలన్నది. వీలైతే పదవ తరగతి వరకు బోధన సాగిస్తూ, ఆంగ్ల భాషను నేర్పించవచ్చు అన్నది. ఇటీవల 2020 జులై 29న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం కూడా మాతృభాషలోనే బోధన కొనసాగించాలన్నది. దీనిని విడుదల చేసిన ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ కూడా దీనిలో ఉన్న "కనీసం ఎనిమిదవ తరగతి వరకైనా మాతృభాషా బోధన ఉండాల"న్న దానిని సమర్థించారు.

## అధికార భాషగా తెలుగు

బ్రిటిష్ పాలనానంతరం తెలుగు రాష్ట్రం ఏర్పడిన తరువాత వారి భాషలోనే పాలన సాగాలని 1953లోనే ఆర్.కాలెట్టల్ అనే విదేశీయుడు తెలిపాడు. 1948లో తూర్పు గోదావరి జిల్లాలో అధికార భాషగా తెలుగు నడిచింది. 1950-51లో హైదరాబాద్ ప్రభుత్వం జిల్లా, తాలూకా స్థాయిలో అక్కడి స్థానిక భాషలు తెలుగు, ఉర్దూ భాషలను అధికార భాషలుగా కొనసాగించాయి. 1955లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు తెలుగు అధికార భాషగా ఉండాలని వావిలాల గోపాలకృష్ణయ్య ప్రతిపాదించారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత 1959లో ప్రభుత్వం పి.సి.జేమ్స్ అనే అధికారిని భాషా వ్యవహారాలు పరిశీలించడానికి ప్రత్యేక అధికారిగా నియమించింది. ఆయన సిఫార్సుల మేరకు ఆంధ్రలో, తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నల్గొండలలో తెలుగు అమలుకు చర్యలు చేపట్టారు. 1964లో వావిలాల గోపాలకృష్ణయ్య తెలుగును అధికార భాషగా చేయాలని ఒక అనధికార బిల్లును ప్రవేశపెట్టారు. ఇది ప్రజాభిప్రాయం కోసం సెలక్ట్ కమిటీకి పంపబడింది. 1966 మార్చి 27న ఈ బిల్లు శాసన సభలో చర్చకు వచ్చింది. 1966 ఏప్రిల్ 1వ తేదీన ఇది ఆమోదం పొందింది. 1966 మే 14వ తేదీన శాసన రీత్యా ఈ చట్టం ఏర్పడింది. 1967లో పి.వి.నరసింహారావు అధ్యక్షతన సమీక్షా సంఘం ఏర్పడి, 1971లో నివేదిక సమర్పించింది. 1974 మార్చి 5న అధికార భాషా విభాగం ఏర్పడింది. 1974 మార్చి 19న ప్రభుత్వ ఉత్తర్వు నం.199-చట్టం 9వ విభాగం ద్వారా అధికార భాషా కమిషన్ ఏర్పడింది. దీనికి ఒక అధ్యక్షుణ్ణి, నలుగురు సభ్యులను రెండేళ్ల కాల పరిమితితో ప్రభుత్వం నియమించింది. ఇదీ స్థూలంగా తెలుగు భాషా ప్రస్థానం, పరిస్థితి.

# నేను చేసింది తప్పే!

యామిజాల జగదీశ్



విక్రమ చోళుడు అనే రాజు ఉండేవాడు. ఆయన ఒకరోజు మారువేషంలో నగరంలో సంచరించాడు. నగరంలోని ఒక చెరసాలలోని ఖైదీలు ఎలా ఉన్నారో చూద్దామనుకుని అక్కడికి వెళ్లాడు.

పలువురు ఖైదీలు అక్కడున్నారు. వారిలో ఒకరిని పిలిచి "నువ్వు ఎందుకు ఇక్కడికి వచ్చావని?" అడిగాడు మారువేషంలో ఉన్న రాజు.

దానికి ఆ ఖైదీ జవాబిస్తూ "నేను ఒక అద్దెకొంపలో ఉండేవాడిని. ఆ ఇంటిని ఖాళీ చేయమని చెప్పారు. మరో ఇల్లు సమయానికి దొరకలేదు. దాంతో ఖాళీ చేయకుండా ఉన్న ఇంట్లోనే ఉండిపోయాను. అందువల్ల నా మీద కేసు పెట్టారు. విచారణ తర్వాత నాకు ఏడాది జైలుశిక్ష విధించారు" అన్నాడు.

రాజు మరొక ఖైదీని పిలిచాడు.... "నువ్వెందుకు ఇక్కడికి వచ్చావని?" అడిగాడు.

దానికతను జవాబిస్తూ "నా మీద ఎలాంటి తప్పూ లేదండి. ఒకరోజు వీధిలో నడుచుకుంటూ పోతున్నాను. దారిలో ఒక బంగారు గొలుసు కనిపించింది. ఎవరూ పట్టించుకోని ఆ గొలుసుని నేను తీసుకున్నాను. డబ్బులు అవసరమైన దానిని అమ్మడం కోసం ఓ దుకాణానికి వెళ్లాను. అక్కడ నన్ను గొలుసు దొంగించావని చెప్పి నన్ను పట్టుకున్నారు. అంతేకాకుండా శిక్ష కూడా విధించారు" అన్నాడతను.

రాజు ఇంకొక ఖైదీని పిలిచి విచారించాడు.

"అయ్యా, మా ఊళ్లో జమాపద్దులు చూసుకునే ఓ మనిషి ఉన్నాడు. ఆయన నన్ను తరచూ డబ్బులు అడిగేవాడు. నా దగ్గర ఏదైనా ఉంటే నేనూ ఇచ్చేవాడిని. అలా ఓసారి నన్ను కలిసి డబ్బులు అడిగారు.

"నా దగ్గర లేవన్నాను".

దాంతో ఆయనకు కోపం వచ్చింది. ఆరోజు రాత్రి ఆయన పచ్చగడ్డి అంటుకుంది. అయితే ఆ ప్రమాదానికి నేనే కారణమని చెప్పి, నా మీద ఫిర్యాదు చేసారు. ఆయన మాట అందరూ నమ్మి నాకు శిక్ష విధించగా ఇక్కడికి వచ్చాను" అన్నాడు ఆ ఖైదీ.

రాజు అతను చెప్పినదంతా విన్న తర్వాత మరొక ఖైదీని పిలిచి అడిగారు.

"స్వామీ, నేను మరేమీ చెయ్యలేదు. ఓ చిన్న గుడి కట్టాలనుకున్నాను. ఆ క్రమంలో పలువురి దగ్గర చందాలు వసూలు చేసాను. అయితే ఆలయ నిర్మాణానికి ఆలస్యమవడంతో డబ్బులు ఇచ్చినవారు నా మీద ఫిర్యాదు చేశారు. దాంతో నన్ను కటకటాలపాలు చేశారన్నాడు" ఖైదీ.

ఇలా ప్రతి ఖైదీ తాము తప్పేమీ చేయలేదనీ, అన్యాయంగా తమను జైల్లో బంధించారని చెప్పి బాధపడ్డారు.

రాజు చివరగా ఒక ఖైదీని విచారించారు.

"నువ్వెందుకు జైలుకు వచ్చావని?" అడిగిన ప్రశ్నకు ఆ ఖైదీ ఇలా చెప్పాడు.

"అయ్యా, నేను చాలా పేదవాడిని. ఏడుగురు పిల్లలు మాకు. అంతేకాకుండా వయస్సు మళ్లిన తల్లిదండ్రులు. ఎంత కష్టించినా తగినంత కూలీ గిట్టేది కాదు. కొన్ని సార్లు పని కూడా దొరికేది కాదు. ఆకలిబాధతో మాడాల్సి వచ్చేది. అందువల్ల చెయకూడని ఒక పని చేశాను. ఒక ధనవంతుడి ఇంట్లో దొంగతనం చేసాను. దొంగిలించడం తప్పని తెలుసు. మరొక మార్గం లేక మతి చెడి దొంగతనం చేసాను. అందువల్ల నన్ను పట్టుకుని నాకు జైలుశిక్ష విధించారు. నేను మూడేళ్ల జైలుశిక్ష అనుభవించాలి" అన్నాడు ఆ ఖైదీ.

"నేనిక్కడికి రావడానికి మరెవరో కారణం కాదు. నాకు నేనే కారణం" అని చెప్పాడు.

చేసిన తప్పుకి ప్రతిరోజూ బాధ పడుతున్నాను" అని అతను కంట తడిపెట్టాడు.

రాజు వెంటనే జైలు అధికారిని పిలిచాడు.

అధికారి వెంటనే వచ్చాడు.

"ఇదిగో చూడండి.. ఇక్కడికి వచ్చినవారెవరూ ఒక్క తప్పూ చేయనివారే. ఈ ఒక్క మనిషే తప్పు చేశాడు. మంచివాళ్లు ఎందరో ఉన్న ఇక్కడి వాళ్ల మధ్య ఓ దుష్టుడు ఉండకూడదు. అందువల్ల వెంటనే ఇతనిని విడుదల చేసి అతనిని బయటకు పంపించేయండి" అని ఆదేశించాడు. చేసింది తప్పని గ్రహించినవాడు విడుదల అయ్యాడు. చేసిన తప్పు ఒప్పుకోవడం అనేది సామాన్య విషయం కాదు. అది మంచి గుణం. తప్పు ఒప్పుకునేందుకు ధైర్యం కావాలి. మనసు పరిపక్వంగా ఉండాలి. ఈ రెండూ ఉన్న ఒకరు కటకటాలపాలై ఊచలు లెక్కిస్తున్నాడు. ఆయన పక్కనున్న మరొక మనిషి "ఏమిటీ? మీరే ఏదీ దాచి పెట్టకుండా ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతున్నారు. మీకీ గతేమిటి?" అని అడిగాడు.

దానికి ఆ పెద్దమనిషి "సోదరా, నేను ఏ పాపమూ చేయలేదు. ఒకరోజు నాకు ఖర్చుకి అయిదు వేల రూపాయలు కావలసి వచ్చాయి. అందుకోసం మరేమీ చేయలేదు. ఇంట్లోంచి డబ్బులు కొట్టేసాను. అది మహా నేరమని చెప్పి నన్ను ఇక్కడ బంధించారు" అన్నాడు.

"అదేంటీ? మన సొంత ఖర్చులకి డబ్బుని ఇంట్లోంచి తీసుకోవడం కూడా తప్పేనా?" అని అడిగాడు వారి మధ్య జరిగిన సంభాషణను విన్న ఇంకొకడు.

"అవును.. అట్లాగే చెప్తోంది చట్టం. ఎందుకంటే నేను డబ్బులు కొట్టేసింది మా ఇంట్లోంచి కాదు, పక్కింట్లోంచి" అన్నాడు చల్లగా.

# దివ్యక్షేత్రం 'ద్వారకా తిరుమల'

ఇలపావులూరి వెంకటేశ్వర్లు



భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ భారతీయులు స్థిరపడ్డారో అక్కడ మరో హిందూ దేవీ దేవత ఆలయం లేకున్నా కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుని ఆలయం తప్పక కనబడుతుంది. ఏడు కొండల మీద యుగాల కిందట కొలువైన శ్రీవారి పట్ల భారతీయులకు గల భక్తిప్రపత్తులకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

విదేశాలలోనే కాదు మన దేశంలో కూడా ఎన్నో శ్రీ బాలాజీ ఆలయాలు నెలకొని ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద తిరుపతితో పాటు చిన్న తిరుపతి కూడా ఉన్నది. పశ్చిమ గోదావరి(ప్రస్తుత ఏలూరు జిల్లా)లో ఉన్న ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రం యుగ యుగాల నుండి 'చిన్న తిరుపతి'గా ప్రసిద్ధి చెంది పిలువబడుతోంది. ఎన్నో విశేషాల నిలయమైన ద్వారకా తిరుమల త్రేతాయుగానికి ముందు నుండి ఉన్నది అని క్షేత్ర పురాణ గాథ తెలుపుతున్నది.

## క్షేత్ర గాథ

కృత యుగంలో ద్వారక మహర్షి శ్రీ మహావిష్ణువు దర్శనాన్ని అపేక్షిస్తూ వందల సంవత్సరాలు తపస్సు చేశారట. ఎత్తైన చీమల పుట్టలు ఆయన చుట్టూ ఏర్పడినాయట. మహర్షి దీక్ష, భక్తిప్రపత్తులకు సంతసించిన వైకుంఠవాసుడు నిజరూప దర్శనమిచ్చారట. ద్వారకా మహర్షి శ్రీరామచంద్రుని తాత అయిన శ్రీ అజ మహారాజు ఈ క్షేత్రంలో శ్రీనివాసుని సేవించారని బ్రహ్మపురాణం పేర్కొన్నట్లు తెలుస్తోంది.

కానీ స్వామి వాల్మీకం పైన సాక్షాత్కరించినందున నడుము కింది భాగం శ్రీ ద్వారక మహర్షికి పాదసేవ నిమిత్తం అనీ; పై భాగం సాధారణ భక్తుల దర్శనార్థం కోసం అంటారు.

వైష్ణవ క్షేత్రాలలో పెరుమాళ్ల పాద దర్శనానికి విశేష ప్రాముఖ్యం ఉన్నది. తొలినాళ్లలో ఆ పాద దర్శనం భక్తులకు లభించేది కాదని చెబుతారు. పదకొండవ శతాబ్దానికి చెందిన శ్రీ వైష్ణవ ఆచార్యులు విశిష్టాద్వైత సిద్ధాంత కర్త అయిన రామానుచార్యులు ద్వారకా తిరుమల క్షేత్రాన్ని సందర్శించారట. ఆయన అక్కడి వారికి పరమాత్మ పాద దర్శన ప్రాధాన్యతను వివరించి మరో అర్చనామూర్తిని స్వయంవ్యక్త రూపం వెనుక ప్రతిష్టించారని తెలుస్తోంది. అలా భక్తులకు శ్రీనివాసుని రెండు రూపాల, పాద దర్శనం లభ్యమవుతోంది.

అర్ధమండపంలో శ్రీ పద్మావతీ అమ్మవారు, శ్రీ నాంచారీదేవి, శ్రీ ఆండాళ్, శ్రీదేవి భూదేవి అమ్మవార్లు కొలువై దర్శనమిస్తారు. గర్భాలయానికి ఎదురుగా శ్రీ ద్వారా మహర్షి, కీర్తనాచార్య శ్రీ అన్నమయ్య విగ్రహాలు, ధ్వజస్థంభం వద్ద అంజనాసుతుడు, వినతానందనుడు స్వామివారికి ముకుళిత హస్తాలతో వందనం చేస్తూ కొలువై ఉంటారు. గర్భాలయ ప్రదక్షిణా పథంలో పన్నిద్దరు ఆళ్వారుల సన్నిధులుంటాయి.

## ఆలయ విశేషాలు

మొదటగా చెప్పుకోవలసింది శ్రీవారు కొలువు తీరిన పర్వతం గురించి. అనంతుడు అనే సర్పరాజు ప్రార్థన మేరకు ద్వారకా మహర్షి అతను శిలారూపం దాల్చిన పర్వతం మీద తపస్సు చేశారట. గమనిస్తే కింద నుండి పైకి వెళ్లే మార్గం పాము చుట్టుకొని ఉన్నట్లుగా కనిపిస్తుంది.

మనం శేషాచలం పర్వతాలను చూస్తే శిఖర భాగాన తిరుమలనాథుడు, తోక భాగాన శ్రీశైలవాసుడు మధ్యలో శ్రీ అహోబిల నారసింహుడు కొలువై ఉంటారు. అదే విధంగా ద్వారకా గిరి మీద కూడా ఒక పక్కన శ్రీ మల్లికార్జున స్వామి కొలువై దర్శనమిస్తారు. ఆ విధంగా ద్వారకా తిరుమల హరిహర క్షేత్రం.

ప్రధాన ఆలయాన్ని ఎవరు ఎప్పుడు నిర్మించారో తెలియదు కానీ ప్రస్తుత ఆలయాన్ని పద్దెనిమిదో శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన ధర్మ అప్పారావు, ఆయన భార్య శ్రీమతి చిన్నమ్మారాణి నిర్మింపచేసినట్లుగా తెలుస్తోంది. స్వామివారికి అలంకరించే అధిక శాతం నగలు వారు సమర్పించారని అంటారు.





గత కొన్ని సంవత్సరాలలో ఆలయ అభివృద్ధి ఘనంగా జరిగింది. ఎన్నో చక్కని గోపురాలు, మండపాలు, నిత్య కళ్యాణ మండపం, అతిథి గృహాలు, ఉద్యానవనాలు, భక్తులకు అవసరమైన ఇతర నిర్మాణాలను, విశాలమైన దారులు నిర్మించారు.

భక్తులకు నిత్యాన్నదాన రూపంలో స్వామివారి ప్రసాదం వితరణ జరుగుతుంది.

ఇరవై సంవత్సరాల కిందటి ద్వారకా తిరుమలకు నేటి ద్వారకా తిరుమలకు ఏమాత్రం పోలిక లేదు. చక్కని నిర్మాణాలతో, ఆధునిక సదుపాయాలతో కూడిన వసతులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండటం విశేషం.

## విశేష పూజలు, ఉత్సవాలు

ఉదయం సుప్రభాత సేవతో మొదలై అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, ఆరగింపులు అన్నీ నిర్ణయించిన విధానం మేరకు జరుపుతారు. ఏకాదశి, పౌర్ణమి, అమావాస్య తిథులలో; పునర్వసు, శ్రావణ నక్షత్రం ఉన్న రోజులలో సంక్రమణం రోజున మండపంలో స్వామివారికి ప్రత్యేక అర్చన, ప్రసాదం నివేదన చేస్తారు.

ఉగాది ఆస్థానం, శ్రీ సీతారామ కళ్యాణం, శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రావణ మాసంలో మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు, కార్తిక మాసంలో క్షీరాబ్ధి ద్వాదశినాడు పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ధనుర్మాస పూజలు, భోగినాడు జరిగే గోదా కళ్యాణం అపురూపం. ఇలా ప్రతిరోజూ, ప్రతి నెలా స్వామివారి దర్శనానికి, ఉత్సవాలకు తరలివచ్చే భక్త సందోహంతో ద్వారకా తిరుమల శోభాయమానంగా ఉంటుంది.

ఇవన్నీ ఒక ఎత్తైతే వైశాఖ మాసంలో పది రోజుల పాటు నిర్వహించే తిరు కళ్యాణోత్సవాలు మరో ఎత్తు. అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. పల్లె వాతావరణం, పర్వత శిఖరం, దేవదేవుడు కొలువైన క్షేత్రం, శబ్ద, వాయు కాలుష్యం లేని సుందర రమణీయ ఆధ్యాత్మిక సౌరభాలను విరజిమ్మే అద్భుత క్షేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువు తీరిన ద్వారకా తిరుమల.

దివ్య క్షేత్రం అనగానే ఆ చుట్టుపక్కల కొన్ని అనుబంధ పురాతన ఆలయాలు తప్పనిసరిగా నెలకొని ఉంటాయి. అదేవిధంగా ద్వారకా తిరుమల పరిసర గ్రామాలలో కూడా కొన్ని ఆలయాలు ఉన్నాయి.

మొదటగా ద్వారకా తిరుమల గ్రామదేవత అయిన శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి దేవాలయం పర్వత పాదాల వద్ద ఉంటుంది. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి.

ద్వారకా తిరుమల నుండి ఏలూరు వైపు వెళ్లే దారిలో 'చిన్న పూరి'గా పిలవబడే శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ స్వామి ఆలయం, లక్ష్మీపురం వస్తుంది. స్వామి సంతానాన్ని ప్రసాదించేవానిగా ప్రసిద్ధి.

ద్వారకా తిరుమల నుండి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఈస్ట్ యడవల్లి గ్రామంలో 'చిన్న భద్రాచలంగా'గా పిలిచే శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం(మద్ది శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే దారిలో) ఉంటుంది. ఇది పురాతన ఆలయం. శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. చిన్న సింహాచలం అని పిలిచే శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉన్న ఐఎస్ జగన్నాథపురం ద్వారకా తిరుమలకు సుమారు ఇరవై ఎనిమిది కిలోమీటర్లు. మరో దివ్య క్షేత్రం 'చిన్న అన్నవరం'గా పిలిచే రంగాపురంలో శ్రీ



భూనీళా సమేత శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం ఉన్నది. రంగాపురం ద్వారకా తిరుమలకు సుమారు ముప్పై అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్నది.

సమీప పట్టణం, జిల్లా కేంద్రం అయిన ఏలూరులో పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయాలు దర్శనీయమైనవి.


## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.**
**మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**
**sunmagvaartha@gmail.com**

# సెల్‌ఫోను రాగాలు

సుస్మితా రమణమూర్తి

**నా**లుగేళ్లు కూడా లేని పిల్లాడు శ్రీరాజ్ లేస్తూనే వెళ్లి క్రికెట్టు మ్యాచ్ చూస్తున్న తండ్రి పక్కన చేరాడు. కరెంటు పోయింది. టి.వి. ఆఫ్ చేసి, అతడు తన ఫోను కోసం పక్కన చూసాడు. అక్కడ అది కనిపించలేదు. కొడుకు డైనింగ్ టేబులు దగ్గర ఫోనులో యూ ట్యూబు ప్రోగ్రాములు తన్మయత్వంగా చూస్తుండటం గమనించాడు. ఒక్కుదుటున లేచి కుర్రాడి దగ్గర ఫోను తీసుకున్నాడు.

కుర్రాడు ఏడ్వసాగాడు.

తండ్రి పట్టించుకోలేదు.

"వెళ్లి బ్రషింగ్ చేయించుకో. ఏదైనా తిని పాలు తాగు. ఆ తర్వాత స్నానం చేద్దువు" అంటూ టీవీకి ఎదురుగా కూర్చున్నాడు అతడు.

కుర్రాడు ఏడుపు ఆపలేదు. ఇంతలో కరెంటు వచ్చింది. అతడు మరల క్రికెట్టు చూడ్డంలో లీనమైపోయాడు. గుక్క పెట్టి ఏడుస్తూనే కుర్రాడు పక్క గదిలోకి వెళ్లాడు. విశ్రాంతి తీసుకుంటున్న తాతగారిని ఫోన్ అడిగాడు.

తాత వాడి మాటలు పట్టించుకోలేదు. కుర్రాడి ఏడుపు రెట్టింపు అయింది.

పూజ చేసుకుంటున్న పిల్లాడి తల్లి అసహనంగా ఆ వైపు చూసింది.

"బాత్రూంలోకి పద.. బ్రషింగు, స్నానం ఒకేసారి అయిపోతాయి" అన్న అమ్మమ్మ మాటలు వాడు వినలేదు. ఫోనిస్తేనే స్నానం చేస్తానన్న వాడి మాటలకు ఆమె విసుక్కుంది. తాతగారిని "అయిదు నిమిషాలు ఫోనివ్వండని" అడిగింది, ఏడుస్తున్నాడని, మారాం చేస్తున్నాడని ఫోనిస్తున్నారు అందరూ. చిన్నప్పుడే వీడికి కళ్లజోడు రావడానికి మీరందరూ కారణమే. డాక్టర్‌గారి హెచ్చరికలు అప్పుడే అందరూ పెడచెవిన పెట్టేసారు"

"నన్నేం చేయమంటారు? వీడి పనులైతేనే నా స్నానం, పూజాను. వీడిలా ఏడుస్తుంటే దాని పూజెలా సాగుతుంది?"

"మీ పనుల కోసం వీడికి సెల్‌ఫోన్ ఇవ్వడం అలవాటు చేసారు. మొదటి నుంచీ నా మాట ఎవరూ వినలేదు. మీ అందరి తప్పిదానికి పరాకాష్టే ఈరోజు వీడు ఫోనిస్తేనే స్నానం చేస్తాననడం!"

తాతగారి స్వరంలోని తీవ్రతకు ఆమె బదులు చెప్పలేక తల పట్టుకుంది.

వీరి మాటలకు పూజలో ఉన్న కూతురు తన హ్యాండ్ బ్యాగ్‌లోని ఫోన్ తీసి కొడుక్కి ఇస్తూ "ఆయనెప్పుడూ అంతేరా! తనకు ఏది నచ్చితే అదే చేస్తారు. ఎవరి మాటా వినరు". కూతురు కోపంగా అన్న మాటలకు తాతగారు ముభావంగా ఉండిపోయారు. ఇంకా అక్కడే ఉన్న భార్యవైపు కోపంగా చూసాడు.

"ఈ ఇంట్లో ఎవరి ధోరణి వారిదే కదా! ఒకరి మాట ఒకరు వినరు" అంటూ ఆమె అక్కడ నుంచి వెళ్లిపోయింది.

తల్లి ఇచ్చిన ఫోను తీసుకుని కుర్రాడు ఆనందంగా ఆన్ చేసాడు. చార్జింగు లేనందున అది ఆన్ కాలేదు. ఆ ఫోను పక్కన పడేసి మరల ఏడ్వసాగాడు వాడు.



తల్లి పూజ సాగడం లేదు.

"వీడి సంగతి చూడండి" అన్న భావం ఉట్టిపడేలా భర్త వైపు చూసింది ఆమె.

"ఏడిస్తే ఏడవనీ! రెండు రోజులు అందరం డాక్టర్‌గారు చెప్పినట్లు వీడిని ఫోనుకి దూరంగా ఉంచగలిగితే వీడు ఫోను మేనియాకు తప్పకుండా దూరం అవుతాడు" అంటూ ఆయన టీవీ చూడసాగాడు.

మరల ఆమె తాతగారి దగ్గరకు వచ్చింది. "నేనింకా స్నానం చేయలేదండీ! ఓ అయిదు నిమిషాలు మీరు ఫోనిస్తే ఊరుకుంటాడండీ. ఈలోగా దాని పూజ, వీడి స్నానం అయిపోతాయి" నెమ్మదిగా అడిగిందామె.

"మీ అందరి సమర్థింపుల వల్లే వీడిలా మంకు పట్టు పడుతున్నాడు. ఫోను చూసేటప్పుడైనా వీడు కళ్లజోడు పెట్టుకోవడం లేదు".

కుర్రాడు వెంటనే కళ్లజోడు పెట్టుకుని తాతగారి ముందు నిల్చున్నాడు.

వాడి తెలివితేటలకు తాతగారి కోపం పెరిగింది.

"పోరా పో. ముందు పళ్లు తోముకుని, స్నానం చేయి. తర్వాత ఏదైనా తిని పాలు తాగుదువు" అని తాతగారు అరచినట్లు అనేసరికి వాడు మళ్లీ ఏడ్వసాగాడు.

"ప్రశాంతంగా పూజ చేసుకోవడానికి కూడా అవకాశం లేదు ఈ ఇంట్లో" అంటూ పూజ గది తలుపులు కోపంగా మూసేసింది ఆమె. ఆ చర్యకు తల్లి మనసు చివుక్కుమంది.

"ఏడ్పు ఆపరా నాయనా! మీ తాత మహా మొండివారు. మిలట్రీలో చేసారు కదా! ఆ బుద్ధులు ఎక్కడకు పోతాయి?" అని భర్త వైపు చూస్తూ కోపంగా అంది.

కుర్రాడి చిట్టి బుర్రకు ఏమి అర్థం అయిందో తెలియదుగానీ, ఏడ్పు తగ్గుముఖం పట్టసాగింది.

"పిల్లల మొండితనానికి, పెద్దలు మరింత మొండిగా ఉంటేనే చెప్పిన మాట వారు వింటారని" డాక్టర్‌గారు చెప్పిన విషయం చూచాయగా అమ్మమ్మకు అర్థం కాసాగింది.

# మంచి సంబంధం కుదరాలంటే?


**వాస్తువార్త**

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




(గత వారం తరువాయి...)

## కళ్యాణప్రదం

వాస్తు, జ్యోతిష్యం ప్రకారం తూర్పు దిక్పాలకుడు ఇంద్రుడు. తూర్పు దిగ్పతి శుక్రుడు. దక్షిణం దిగ్పతి యముడు. దక్షిణ దిక్పాలకుడు కుజుడు. ఆగ్నేయంలో దిగ్పతి చంద్రుడు. ఆగ్నేయ దిక్పాలకుడు అగ్నిదేవుడు. ఇంద్రునికి, శుక్రుడికి, యమధర్మరాజుకి, అగ్నిదేవుడికి, చంద్ర గ్రహానికి, కుజ గ్రహానికి, ఇద్దరు వ్యక్తుల వివాహ బంధం విషయంలో, చాలా దగ్గర 'కారకత్వ సంబంధం' ఉంటుంది. ఈ రెండు దిక్కులు (తూర్పు, దక్షిణం దిక్కులు) కలిసే మూల ఆగ్నేయం. అంటే అగ్నిదేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు చేసే చిన్న ప్రయత్నాలు కూడా కళ్యాణప్రదంగా గొప్ప ఫలితాలను ఇస్తాయి. వీరి అనుగ్రహంతో జరిగే వివాహాలు సకల సంపదలతో సత్సంబంధాలుగా కలకాలం నిలబడేటట్టుగా ఎక్కువ అవకాశాలు ఏర్పడతాయి.

## మంచి సంబంధాల కోసం 'ఆగ్నేయ ప్రసన్న ప్రక్రియ'

పెళ్లిచూపుల రోజున ఆగ్నేయంలో చేయవలసిన ఒక చిన్న ప్రక్రియ ఉంటుంది. పొద్దున్నే స్నానం చేసి శుచిగా ఈ ప్రక్రియ చేయండి. పెళ్లిచూపులు ఎవరికైతే జరుగుతున్నాయో ఆ అబ్బాయి అయినా/అమ్మాయి అయినా సరే వాళ్లే చేయటం శ్రేష్టం. వాళ్ల వల్ల కానప్పుడు వాళ్లకు సంబంధించిన రక్త సంబంధీకులు, లేదా పెద్దలు ఈ పని చేయటం ద్వితీయ శ్రేష్టం. ఇంటిలోపల, ఆగ్నేయ మూలన ఈ పని చేయవలసి ఉంటుంది. సాధారణంగా ఇంటికి ఆగ్నేయంలో వంటగది ఉంటుంది. అక్కడ ఆగ్నేయంలో(అలా కాకుండా అక్కడ ఇంకేదో.. బెడ్‌రూమ్ ఉంటే- ఆ రూమ్‌లోనే ఆగ్నేయ మూలలో) ఒక బర్నర్‌గానీ, స్టవ్‌గానీ వెలిగించండి. ఆవుపాలు పోసిన గిన్నెను స్టవ్ మీద పెట్టండి. ఇప్పుడు స్టవ్ వెలిగించండి. ఆ పాలు పొంగిపోవడం మీరు చూడాలి. అప్పుడు ఆ పాలతో ఏదైనా తీపి వంటను చేయండి. తాటిబెల్లం ప్రధానం. అది దొరకనప్పుడు మామూలు బెల్లం లేదా పంచదారను ద్వితీయ ప్రాధాన్యంగా వాడవచ్చు. ఆ తీపి వంట పరమాన్నం కావచ్చు, సేమ్యా కావచ్చు, రవ్వకేసరి కావచ్చు. చక్కగా డ్రైఫ్రూట్స్ వేసి రుచిగా వంట చేయండి. దాన్ని ఒక చిన్న గిన్నెలో లేదా ఆకుదొప్పలోగానీ పెట్టి ఇంట్లో మీరు ప్రతిరోజూ పూజలు చేసే చోట దీపారాధన చేసి, ఈ తీపి వంటకాన్ని నైవేద్యంగా హారతితో సమర్పించండి.

పెళ్లిచూపులు జరిగే రోజున పొద్దున, మధ్యాహ్నం లేక సాయంత్రం ఎప్పుడు ఉన్నా సరే, మీరు ఈ ఆగ్నేయ ప్రక్రియను, నైవేద్య సమర్పణ పనిని వీలైనంత పొద్దున్నే శుచిగా చేయాలి.

అమ్మాయి కావచ్చు, అబ్బాయి కావచ్చు. ఇంట్లో ఈ ప్రక్రియ చేసుకున్న తర్వాత పెళ్లిచూపులకి రెడీ అవ్వండి. పెళ్లిచూపులు సాధారణంగా అమ్మాయివాళ్ల ఇంట్లో జరుగుతాయి. ఏదైనా గుడిలో ఏర్పాటు చేస్తారు. లేదా ఏదైనా రెస్టారెంట్‌లో మీ ఇద్దరికీ ప్రత్యేకంగా కూడా ఏర్పాటు చేయవచ్చు. ఉత్సాహంగా విచక్షణతో మెలగండి. అంతే!

అయితే 'ఈ సంబంధం తప్పకుండా మీకు కుదురుతుంది' అని నేను చెప్పటం లేదు. ఒకవేళ అది మీకు తగిన సంబంధం కాకపోతే, మీ ఇద్దరికీ కుదరని స్వభావాలు ఉన్నట్లయితే తర్వాత విడిపోయి బాధ పెట్టేది, మోసపూరితమైనది అయితే ఆ సంబంధం మీకు కుదరదు. మీరు వారికి నచ్చకపోవచ్చు. లేదా వారు మీకు నచ్చకపోవచ్చు. సంబంధం వీగిపోతుంది. విచారించనవసరం లేదు. అది మీ అభిరుచికి తగిన మంచి సంబంధం అయితే మీ అన్యోన్య దాంపత్యానికి పునాది



వేసేదైతే, ఒకరినొకరు సపోర్ట్ చేసుకుంటూ కలకాలం నిలువగలిగేదైతే తప్పకుండా కుదురుతుంది. పెళ్లిచూపులు పెట్టుకున్న ప్రతిసారీ ఈ ప్రకియ మీరు చెయ్యండి. కొన్ని సంబంధాలు తప్పిపోవచ్చు. అది మీ మంచి కోసమే అని గ్రహించండి. కానీ ఈ ప్రక్రియ వలన మీకు మంచి సంబంధమే నిలుస్తుంది.

## విడాకులు తీసుకున్న వాళ్లకోసం..

ఇదివరకే పెళ్ళిళ్లు అయి, బాధలు పడి, విడాకులు తీసుకున్నవాళ్ల ఈసారి ఒక మంచి సంబంధం కావాలనుకుంటే ఈ ప్రక్రియను చేయండి. ఇంతకు ముందులా కాకుండా, ఈసారి మంచి సంబంధం దొరుకుతుంది. ఆనందంగా జీవితాన్ని ఆస్వాదించండి.

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

**వాస్తువార్త**

పూర్తి పేరు.........................................................

పుట్టినతేదీ : ..................... ఊరు : .................

జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: ......................

చిరునామా: ...................................................



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ముఖ్యమైన విషయాలను, చర్చలను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిది. సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. శుభకార్యాలు, శుభ కార్య సంబంధిత ప్రసంగాలు ఫలవంతంగా సాగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. యాంత్రికంగా పనులు పూర్తి చేస్తారు. శ్వేతార్క గణపతిని పూజించండి.

## వృషభం



ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. కోపతాపాలకు దూరంగా ఉండండి. బంధు, మిత్రుల సలహాలు తీసుకుంటారు. మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. రవాణా శాఖలో ఉన్నవారికి బాగుంటుంది. వ్యాపార నిమిత్తం కొత్త వాహనం కొనుగోలు చేస్తారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి.

## మిథునం



కళ, సాహిత్యాల పట్ల ఆసక్తి కలిగి వుంటారు. సినిమాలు, ఎలక్ట్రానిక్ మీడియా పట్ల ఆకర్షణ ఏర్పడుతుంది. ఇంట్లోవారికి నచ్చకపోయినా కొత్త కోర్సులు నేర్చుకోవాలని భావిస్తారు. కొంతమంది వల్ల నిరాశ ఎదురవుతుంది, ఆశించిన స్థాయి వారి అండదండలు లభించకపోవచ్చు. పూజల్లో నాగబంధం కుంకుమ ఉపయోగించండి. ప్రేమ వ్యవహారాల పట్ల ఆకర్షణ ఉంటుంది.

## కర్కాటం



కొత్త మాధ్యమాల ద్వారా ధనం సంపాదించాలన్న ఆలోచనలు కలిసివస్తాయి. జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం కోల్పోకండి. ఓర్పు వహించండి. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి. సోదరుల నుంచి ధన లాభం పొందుతారు. నూతన ఒప్పందాలు పరిష్కారం చేసుకుంటారు. నిందారోపణలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి.

## సింహం



ఇంటికి సంబంధించిన వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. చిన్ననాటి స్నేహితుల వల్ల ప్రయోజనాలు పొందుతారు. వారాంతంలో ఉపయుక్తమైన సమాచారం తెలుసుకుంటారు. పూజలలో ఆరావళి కుంకుమ ఉపయోగించండి. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో ప్రతిరోజూ దీపారాధన శుభప్రదం.

## కన్య



భూముల క్రయ-విక్రయాలలో లాభాలు పొందుతారు. వివాహాది శుభ కార్యాలు సానుకూలపడతాయి. కీలకమని భావించిన విషయాలలో తొందరపాటు తగదు, జాగ్రత్త వహించండి. జిల్లేడు వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. ఆటంకాలు తొలగిపోతాయి. కాళ్లకు చక్రాలు కట్టుకొని మరీ పని చేస్తారు. ప్రయోజనాలు కోల్పోకూడదని భావిస్తారు.

## తుల



మంచి విషయాల గురించి సమయం ఉపయోగించుకుంటారు. కాలక్షేపం చేసేవారు మీకు నచ్చరు. స్నేహితులు, సన్నిహితులు అయినా ఇది మంచిది పద్ధతి కాదని నిర్మొహమాటంగా వారికి సలహాలిస్తారు. నూతన క్రయ-విక్రయాలు ప్రారంభిస్తారు. ఫుడ్, కిరాణా వ్యాపారాలు బాగుంటాయి. చేతికి కుబేర కంకణం ధరించండి. లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. కొద్దిపాటి పెట్టుబడితో మంచి లాభాలు ఆర్జిస్తారు.

## వృశ్చికం



రహస్య మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందిస్తారు. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. కీలకమైన వ్యక్తుల గురించి అసలు విషయాలు తెలుసుకుంటారు. ప్రేమ వివాహాలు, వ్యవహారాలు విఫలమవుతాయి. బ్యాంకు రుణాల గురించి అధికంగా ఆలోచిస్తారు.

## ధనుస్సు



ఆశించిన శుభవార్తలు వింటారు. స్వల్ప ప్రయోజనాల కోసం పెద్ద స్థాయి పరిచయాలను ఉపయోగిస్తారు. మీవారి కోసం కొన్ని పనులు చెయ్యక తప్పనటువంటి పరిస్థితులు ఏర్పడతాయి. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. పెళ్లి సంబంధాల కోసం చేసే ప్రయత్నాలు అంతంత మాత్రంగా ఉంటాయి. కొంతమంది చేసే ప్రచారాలు మీకు నచ్చవు. వాస్తవాలకు అతీతంగా వున్నవాటిని మీరు ఆమోదించరు.

## మకరం



మొండి మనుషులను సైతం మార్చగలుగుతారు. కార్యాలయంలో మార్పులు ఏర్పడతాయి. వాటిని మీకు అనుకూలంగా మార్చుకోవడానికి మరికొస్త వ్యవధి పడుతుందని గ్రహిస్తారు. రాజకీయ స్నేహాలు బలపడతాయి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. రెన్యువల్స్ కోసం దరఖాస్తులు దాఖలు చేస్తారు. శుభవార్తలు వింటారు. ఆదాయ మార్గాలు తెరుచుకుంటాయి. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.

## కుంభం




మనవాళ్లే కదా అని చూసీ చూడకుండా వదిలేసినా కొన్ని కొత్త సమస్యలు, చికాకులు వస్తాయి. నూతన వ్యాపారాల వ్యవహారాలు కుదురుతాయి. పాత వ్యాపారాలు బాగా అభివృద్ధి చెందుతాయి. రొటేషన్స్‌లో లాభాలు ఊరట కలిగిస్తాయి. క్రయ-విక్రయాలు బాగుంటాయి. ఒక స్థలం అమ్మకానికి పెడతారు, మంచి ధర కోసం ఎదురు చూస్తారు.


## మీనం




జీవిత భాగస్వామితో విభేదాలు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి. ఎన్నో రకాల ప్రయోజనాలు ఆశించి కొంతమంది వ్యక్తులను ఆశ్రయిస్తారు, అవి ఫలిస్తాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. నరదృష్టి తొలగిపోతుంది. అన్ని రకాల వ్యాపారస్తులకి అనుకూల ఫలితాలు గోచరిస్తున్నాయి. వృత్తిరీత్యా ప్రోత్సాహం లభిస్తుంది. డ్రైవింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండండి.

# ఈ వారం 'కార్టూన్స్'


ఏంట్రా మాటలు.. నీకు దక్కనిది ఎవరికీ దక్కనివ్వనా?
మరి నీకు దక్కింది అందరికీ పంచుతావా..?
Zakir...


నా చుట్టమే.. కష్టంగా తెలియదు.. వారం
రోజులుగా ఆస్పత్రిలోకే రాతడు.. దంచేసా..!!
Zakir...


క్రిటికల్ అయితే నా చేతిలో ఉంటుంది.. కానీ
మీకొచ్చింది కాస్త జబ్బు.. అంతా మీ చేతుల్లోనే ఉంటుంది..!!
Zakir...

# ఫోటో ఫీచర్



అన్ని కాలాలకి అనువైన హాలిడే డెస్టినేషన్‌గా పేరు గాంచింది పశ్చిమ బెంగాల్‌లోని కుర్సియాంగ్ హిల్ స్టేషన్. తేయాకు తోటలు, జలపాతాలు, జింకల పార్కు, ఫారెస్ట్ మ్యూజియం, సుభాష్‌చంద్రబోస్ మ్యూజియం తప్పనిసరిగా చూడాల్సినవి.











